ప్రజాశక్తి

గురువారం 23 జనవరి 2025 8 పేజీలు

ప్రకాశం బాపట్ల





సంక్షేమ హాస్టళ్ల నిర్వహణలో

నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

- మరమ్మతుల పనులు పూర్తి చేయాలి
- తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలి
- సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ శ్రీబాలవీరాంజనేయ స్వామి



మాట్లాడుతున్న మంత్రి డోలాశ్రీ బాలవీరాంజనేయ స్వామి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

పేద పిల్లలు చదువుకుంటున్న సంక్షేమ హాస్టళ్ళ నిర్వహణలో, ఉత్తమ పరీక్ష ఫలితాలు రాబట్టడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి స్పష్టం చేశారు. ప్రకాశం భవనంలో సాంఘిక సంక్షేమ, వైద్య, ఆరోగ్య, తాగునీటి సరఫరా శాఖల ఉన్నతాధికారులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంక్షేమ హాస్టళ్ల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రూ.143 కోట్లు హాస్టళ్ళ మరమ్మతుల కోసం మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో మరమ్మతు పనులను త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. హాస్టల్లోని సిబ్బంది, ట్యూటర్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ హాస్టల్లో పదో తరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆయన స్పష్టం చేశారు. హాస్టల్లోని విద్యార్థులకు రెగ్యులర్‌గా ఆరోగ్య పరీక్షలు చేయాలని పునరుద్ఘాటించారు. ఖాళీలు ఉన్న చోట విద్యార్థుల సామాజిక తరగతితో సంబంధం లేకుండా అడ్మిషన్లు మంజూరు చేయాలని మంత్రి సూచించారు. వికలాంగులైన విద్యార్థులు పెన్షన్ల కోసం ప్రతి నెల వారి స్వగ్రామాలకు వెళ్లకుండా ఆన్‌లైన్‌లోనే పెన్షన్ డబ్బులను వారి ఖాతాలో జమ చేయాలని ప్రభుత్వం నిర్ణయించటంతో ఈ దిశగా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా, టిడిపి దర్శి నియోజక వర్గ ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి, యర్రగొండపాలెం నియోజక వర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మా నాయక్, ఎస్ సి కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్, ఎపిఎస్‌డబ్ల్యుఆర్ఇఐఎస్ కో-ఆర్డినేటర్ జయ, వికలాంగుల సంక్షేమ శాఖ ఏడీ జి.అర్చన, డిఎం,హెచ్ డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, డిసిహెచ్‌ఎస్ సూరిబాబు, ఇరిగేషన్ ఎస్.ఈ. వరలక్ష్మి, ప్రాజెక్ట్స్ ఎస్ఇ బాల మురళీ మోహన్, ఆర్.డబ్ల్యు.ఎస్. ఎస్ఇ (ఇన్‌ఛార్జి) బాల శంకర రావు, రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ ▶ 2లో

జిజిహెచ్ అభివృద్ధికి చర్యలు



దాతల సహాయంతో ఒంగోలు ప్రభుత్వ వైద్యశాలను మరింతగా అభివద్ధి చేస్తామని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు తెలిపారు. రిమ్స్ ఆసుపత్రి పై వచ్చే నెల మొదటి వారంలో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. మోటార్లు పనిచేయక పోవడంతో మద్దిపాడు, ఒంగోలు, కొత్తపట్నం మండలాల్లోని సుమారు 50 గ్రామాలకు మంచినీటి సరఫరాలో 17 రోజులపాటు సమస్య తలెత్తిందన్నారు. ఇలాంటి సమయంలో ఉపయోగపడేలా స్పేర్ భాగాలను ముందుగానే ఎందుకు అందుబాటులో పెట్టుకోలేదని అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

భవన నిర్మాణాలకు ఎంపీ ల్యాడ్స్

వివిధ భవనాల నిర్మాణానికి అవసరమైన నిధులను ఎంపీ ల్యాడ్స్ నుంచి కేటాయిస్తానని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. ఇందుకు అవసరమైన ప్రతి పాదనలు రూపొందించాలని మాగుంటశ్రీనివాసులురెడ్డి అధికారులను కోరారు.

వైద్యులను నియమించాలి



గిద్దలూరు ఏరియా ఆసుపత్రిలో రేడియాలజిస్టు, పీడి యాట్రిషియన్, అనస్థీషియా వైద్యులను నియమించాలని గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి కోరారు. ఆసుపత్రిలోని నియో నాటల్ కేర్ యూనిట్‌ను స్పెషల్ న్యూ బోర్న్ కేర్ యూనిట్‌గా అప్‌గ్రేడ్ చేయా లన్నారు ప్రస్తుతం నియోజకవర్గంలోని పలు గ్రామాలలో 500 అడుగుల కంటి లోతులో ఉన్న బోర్వెల్స్ మాత్రమే పనిచేస్తున్నాయని, వేసవిని దృష్టిలో పెట్టుకుని అన్ని బోర్లకు మరమ్మతులు చేయాలన్నారు.

గైనకాలజిస్టుపై చర్యలు తీసుకోండి



పామూరు సామాజిక ఆరోగ్య కేంద్రం నుంచి కనిగిరికి డిప్యూటేష వేసిన గైనకాలజిస్ట్ అక్కడ విధులు నిర్వహించడంలేదని విధులకు గైర్హాజరైన ఆమెపై చర్యలు తీసుకోవాలని కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అధికారులను కోరారు.

ముందుకు సాగని 'వెలిగొండ'

నిర్వాసితుల ఊసెత్తని ప్రభుత్వం

ప్రజాశక్తి-మార్కాపురం



వెలిగొండ ప్రాజెక్టు సొరంగం

పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం ముందుకు సాగడం లేదు. ఈ విషయంలో కూటమి ప్రభుత్వం మొక్కుబడిగా వ్యవహరిస్తోందనే విమర్శలు వినిపి స్తున్నాయి. అధికారంలోకి వచ్చి ఏడు నెలలు దాటినా ప్రాజెక్టు పనుల్లో పెద్దగా కదలిక లేదు. గత ఆదివారం నుంచి ఫీడర్ కెనాల్‌లో డ్రిల్లింగ్ పనులు, సొరంగ మార్గాల్లో లైనింగ్ పనులు మొక్కుబడిగా ప్రారంభ మయ్యాయి. ప్రాజెక్టు కోసం త్యాగం చేసిన నిర్వాసితుల పరిహారం ఊసెత్తడం లేదీ కూటమి ప్రభుత్వం.

పశ్చిమ ప్రకాశం కరువుకు పెట్టింది పేరు. ఈ ప్రాంత రైతులు ఏటా వ్యవసాయంలో నష్టాలే మూటగట్టుకుంటున్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోయి అనేక మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తయ్యేదెన్నడని, కృష్ణా జలాలు పారేదెప్పుడని కళ్లలో ఒత్తులేసుకుని చూడటం ఈ ప్రాంత రైతుల వంతైంది.

వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణానికి 1996 మార్చి 5న శంకుస్థాపన చేశారు. ఇప్పటికీ 28 ఏళ్లు పూర్తి చేసుకుంది. ప్రాజెక్టు మాత్రం ఇంకా నిర్మాణంలోనే ఉంది. ఈ ప్రాంత ప్రజలు సాగునీటి, తాగునీటి అవసరాలు తీర్చే ఆశాజ్యోతి వెలిగొండ ప్రాజెక్టు ఒక్కటే అని చెప్పాలి. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో శ్రద్ధ చూపిన వారిలో దివంగత సిఎం డాక్టర్ వైఎస్ఆర్ మాత్రమే అన్ని చెప్పొచ్చు. 2004-09 మధ్య కాలంలో 60 శాతం పనులను పూర్తయ్యాయి. ఆ తరువాత పాలకులు ఎందరో మారినా ప్రాజెక్టు పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. అప్పట్లో శంకుస్థాపన చేసిన చంద్రబాబునాయుడు ప్రస్తుతం ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు. ఆయనకు వెలిగొండ ప్రాజెక్టు ప్రాధాన్యత తెలియనిదేమీ కాదు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముగ్గురు మంత్రులు ప్రాజెక్టు సందర్శించారు. ప్రాజెక్టు పూర్తయ్యేందుకు ఇంకా రెండేళ్ల సమయం పడుతుందని చెప్పుకొచ్చారు. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పిన మాటలు ఈ ప్రాంత ప్రజలకు నమ్మశక్యంగా లేవు. ప్రాజెక్టులో మిగిలిన పనులు 10 శాతం మాత్రమే. మిగిలిపోయిన పనుల కోసం రూ. 2వేల కోట్లు అవసరం. ఈ ఏడాది బడ్జెట్‌లో కేటాయించిన మొత్తం రూ. 394 కోట్లు మాత్రమే. ఈ బడ్జెట్ ▶ 2లో



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి ఎఆర్. దామోదర్

కిలాడి లేడీ అరెస్టు

▶ 3లో

సంక్షేమ హాస్టళ్ల నిర్వహణలో
నిర్లక్ష్యాన్ని సహించేదిలేదు

(మొదటిపేజీ తరువాయి)

డాక్టర్ టి.జమున తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తున్న వారిపై చర్యలేవీ
మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి



మార్కాపురంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గతంలో 800 ఉన్న ఓపిలు ప్రస్తుతం 200లకు తగ్గిపోయాయని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తెలిపారు. ఆసుపత్రులకు వచ్చే రోగులపై శ్రద్ధ పెట్టకుండా వైద్యులు ప్రైవేట్ గా ప్రాక్టీస్ చేస్తున్నారన్నారు. శానిటరీ వర్కర్ ను ఏజెంట్‌గా పెట్టుకుని వికలాంగుల పెన్షన్ కోసం నకిలీ సర్టిఫికెట్లను వైద్యులు మంజూరు చేశారన్నారు. ఇప్పటివరకు శానిటరీ వర్కర్ పైన చర్యలు తీసుకోలేదని తెలిపారు. ఈ విషయమై సూపరింటెండెంట్‌ను మంత్రి వివరణ కోరగా.... డిఎంఈతో సమావేశం ఉండడంతో సూపరింటెండెంట్ రాలేదని, దీంతో తాను వచ్చానని డిప్యూటీ సూపరింటెండెంట్ చెప్పడంతో మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి, కలెక్టర్ సమీక్ష నిర్వహిస్తుంటే డి.ఎం. ఈ రాకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

ముందుకుసాగని 'వెలిగొండ'

(మొదటిపేజీ తరువాయి)

జీత భత్యాలకు, విద్యుత్ బిల్లులకు, ఇతరత్రా ఖర్చులకు మాత్రమే సరిపోతాయని, పనుల కోసం పెద్దగా నిధులు మిగలవని ప్రాజెక్టు అధికారులు చెబుతున్నారు. పాత బిల్లులు కొంత పెండింగ్‌లో ఉన్నాయి.

వెలిగొండ ప్రాజెక్టు రాకతో ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని ఉన్నఊరిని వీడేందుకు ముంపు గ్రామాల ప్రజలు త్యాగం చేశారు. త్యాగం చేసిన నిర్వాసితులకు ఇచ్చే ప్యాకేజి అరకొరగా ఉంది. ఎప్పుడో నిర్ణయించిన ప్యాకేజి రూ. 12.5లక్షలతో సాగనంపాలని ప్రభుత్వం చూస్తోంది. ఒక్కో కుటుంబానికి రూ. 20 లక్షలు ప్యాకేజి ఇచ్చినా తక్కువే అని చెప్పారు. నిర్వాసితులకు మెరుగైన ప్యాకేజితో పునరావాసాలకు గౌరవంగా సాగనంపాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. గతంలో నిర్ణయించిన ఆర్అండ్ఆర్ ప్యాకేజి ప్రకారం ప్యాకేజి రూ. 1200 కోట్లకు పైగా అవసరం.

వెలిగొండ ప్రాజెక్టు కోసం ఆది నుంచి కమ్యూనిస్టులు గళం విప్పారు. పెద్ద ఎత్తున ఉద్యమించారు. ఆ తరువాత వెలిగొండ ప్రాజెక్టుకు బీజం పడింది. ప్రాజెక్టు కోసం, నిర్వాసితుల కోసం కమ్యూనిస్టులు నేటికీ ఉద్యమిస్తూనే ఉన్నారు. కూటమి ప్రభుత్వం కూడా వెలిగొండ విషయంలో మీనమేషాలు లెక్కిస్తోందని తెలిసింది. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు గత ఏడాది నవంబర్‌లో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు బివి.రాఘవులు వెలిగొండ ప్రాజెక్టును సందర్శించారు. ప్రాజెక్టు స్థితిగతులపై సిఎం చంద్రబాబుకు లేఖను కూడా రాశారు. మరోమారు రాఘవులు గురువారం కనిగిరికి రానున్నారు. వెలిగొండ జలాల సాధన పేరుతో కనిగిరిలో నిర్వహిస్తున్న సదస్సుల్లో పాల్గొంటారు. వెలిగొండ నిర్మాణం కోసం... నిర్వాసితుల ప్యాకేజి కోసం మరోమారు కమ్యూనిస్టులు పెద్ద ఎత్తున ఉద్యమించేదుకు సిద్ధమవుతున్నారు.

శనగ పంట పరిశీలన

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని రుద్రవరం, గురవారెడ్డిపాలెం గ్రామాలలో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి పి పావని గ్రామాల్లోని శనగ పంటను పరిశీలించి సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు. రుద్రవరం గ్రామంలో వరి పొలంలో ఎన్‌పిఎస్ఎస్ యాప్‌లో పంట స్థితి, చీడపీడల ఉధృతి వివరాలను నమోదు చేశారు. అనంతరం వ్యవసాయ అధికారి సూపర్‌చెక్ తనిఖీ నిమిత్తం రుద్రవరం, గురవారెడ్డిపాలెం గ్రామాలలో శనగ, పొగాకు పంటలలో ఈ పంట నమోదు చేసిన రైతుల వివరాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు ఎస్ వెంకటరావు, కెవి సుబ్బారెడ్డి, రుద్రవరం, గురవారెడ్డిపాలెం గ్రామ వ్యవసాయ సహాయకులు సిహెచ్ నిఖిల్, పి సాయిరాం, రైతులు పాల్గొన్నారు.

మురికి కూపాలుగా దళితవాడలు

ప్రజాశక్తి-కొండపి



దళితవాడలో మురికి కాలువలను పరిశీలిస్తున్న కంకణాల ఆంజనేయులు

దళితవాడల కాలువల్లోని మురుగు తొలగించే ప్రయత్నాలు చేయకపోవడంతో దళిత వాడలు మురికి కూపాలుగా మారాయని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు అన్నారు. దళితవాడల సర్వేలో భాగంగా గుర్రప్పడియ, నెన్నూరుపాడు, కొండపి మొదలైన దళితవాడల్లో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు చెప్పిన సమస్యలను ఆసరా చేసుకొని కొండపిలో ఆంజనేయులు మాట్లాడారు. ప్రభుత్వాలు పంచాయతీలకు తగిన నిధులు కేటాయించకపోవడం, ఉన్న కొద్దిపాటి నిధులపై కూడా కనీస పర్యవేక్షణ లేనందున గ్రామాలు, ప్రత్యేకంగా దళిత వాడలు మురికి కూపాలుగా మారాయని అన్నారు. రోడ్లు లేకపోవడం, రోడ్డు వేసిన దగ్గర మురుగు కాలువల నిర్మాణం చేయకపోవడంతో మురుగు కేంద్రాలుగా కాలనీలు మారాయని అన్నారు. కాలువలు ఉన్న చోట కూడా మురుగు తొలగించకపోవడంతో దళితవాడలు మురికి గుంతలుగా మారాయని, వాటిల్లో రకరకాల దోమలు చేరి కుట్టడంతో ప్రజలకు విష జ్వరాలు కమ్ముకున్నాయని అన్నారు. ప్రతి దళితవాడలో ఇంటికి ఇద్దరు ముగ్గురు చొప్పున విష జ్వరాలు, చికున్ గున్యా రోగాలతో అల్లాడిపోతున్నారని అన్నారు. ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పేదలకు వైద్య సౌకర్యం కల్పించి ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నెరుసుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలోని దళితవాడలలో సామాజిక వివక్షతను, అభివృద్ధిలో వివక్షతను అధ్యయనం చేస్తున్నామని తెలిపారు. ఏ దళితవాడ చూసినా మౌలిక వసతులు లేవని, అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయని అన్నారు. ప్రభుత్వాలు స్పెషల్ కాంపోనెంట్ ప్లాన్‌తో ఎస్సీ ఎస్టీ పేటల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నామని చెప్పటం తప్ప ఆచరణలో అభివృద్ధి అడుగు ముందుకు పడలేదని అన్నారు. సమాజం మారుతున్నా సామాజిక వివక్షత నేటికీ అనేక రూపాల్లో కొనసాగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కేజీ మస్తాన్ మాట్లాడుతూ సర్వే ద్వారా సేకరించిన సమస్యల ఆధారంగా రాబోయే కాలంలో ఉద్యమాలు చేపడతామని అన్నారు. ప్రభుత్వాలు ప్రజలకు కనీసం తాగునీరు కూడా ఇవ్వలేని పరిస్థితిలో ఉండటం విచారకరమన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమాలే మార్గమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మక్కెన కోటేశ్వరరావు, ఏసుదాస్, మరియమ్మ, బాలయ్య, బ్రహ్మయ్య, ప్రసన్న, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

సురక్షితంగా గమ్యస్థానాలకు చేరాలి: ఎస్ఐ

ప్రజాశక్తి-మద్దిపాడు



రాంగ్ రూట్లో వస్తున్న వాహనాలను వెనక్కి పంపుతున్న ఎస్ఐ శివరామయ్య

వాహనదారులు సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరాలని ఎస్ఐ శివరామయ్య అన్నారు. మండల పరిధిలోని మద్దిపాడు-వెల్లంపల్లి గ్రామాల మధ్య ఆపోజిట్ డైరెక్షన్‌లో వస్తున్న వాహనాలను బుధవారం వెనక్కి పంపించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శివరామయ్య మాట్లాడుతూ వెల్లంపల్లి, కొలచనకోట, మల్లవరం, తెల్లబాడు, దొడ్డవరం, తాళ్లూరు మండలంలోని పలు గ్రామాలకు చెందిన అనేకమంది నిత్యం వెల్లంపల్లి నుంచి ఆపోజిట్ డైరెక్షన్లో మద్దిపాడులోకి ప్రవేశిస్తున్నారని చెప్పారు. ఈ క్రమంలో రాంగ్ రూటులో ప్రయాణిస్తుండగా ప్రమాదాలు ఎక్కువగా జరిగి ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు వాహనదారులను వెల్లంపల్లి నుంచి గుల్లపల్లి ఫ్లైఓవర్ కింద నుంచి యుటర్న్ తీసుకొని మద్దిపాడుకు రావాలని సూచించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు. ప్రజల శ్రేయస్సు కోసం చేసే పనిలో ప్రజలందరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రతి రైతుకూ గుర్తింపు కార్డులు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల



పంటను పరిశీలిస్తున్న అధికారులు

పెద్ద దోర్నాల మండలంలోని చింతల, మర్రిపాలెం గ్రామాలలో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో సాగు చేసిన మినుము, జొన్న, మిరప పంటలను మండల వ్యవసాయ అధికారి డి జవహర్‌లాల్ నాయక్ సందర్శించారు. ప్రస్తుతం వ్యవసాయ శాఖ ద్వారా రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ ద్వారా ప్రతి రైతుకు గుర్తింపు కార్డులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. రబీ కాలంలో సాగు చేసిన పంటలకు ఈ పంట నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విఎఏ పరిపూర్ణ, విహెచ్ఏ నీలా నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న మహిళలు

కేసు నమోదు చేయాలని మహిళల నిరసన

ప్రధాన రహదారిపై ట్రాఫిక్ జామ్

ప్రజాశక్తి -గిద్దలూరు రూరల్

ఈతకు వెళ్లి యువకుడు మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేయాలంటూ గిద్దలూరు మండలం కృష్ణం శెట్టిపల్లె మహిళలు బుధవారం అమరావతి-అనంతపూర్ ప్రధాన రహదారిపై నిరసన చేపట్టారు. గత అక్టోబర్ 28వ తేదీన గ్రామంలో ఈతకు వెళ్లిన ఐదుగురు యువకుల్లో గడ్డం ఆనందు మృతి చెందారు. దీనికి సంబంధించి పోలీసులు కేసు నమోదు చేయలేదంటూ ఆనందు బంధువులు రోడ్డుపై బైఠాయించి నిరసనకు దిగారు. కేసు వివరాలు తెలపాలంటూ గత సోమవారం, మంగళవారం గిద్దలూరు పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేసినప్పటికీ పోలీసులు స్పందించ లేదని నిరసనకారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం 7 గంటల నుండి దాదాపు 9 గంటల వరకు నిరసన కొనసాగింది. రహదారిపై అటు ఇటు దాదాపు నాలుగు కిలోమీటర్ల మేర భారీగా వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ స్తంభించింది. సమాచారం అందుకున్న గిద్దలూరు అర్బన్ సిఐ సురేష్, రూరల్ సిఐ రామకోటయ్యలతో పాటు మార్కాపురం సిఐ సుబ్బారావు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ముగ్గురు సీఐలు నిరసనను విరమింప చేసేందుకు చేసిన కృషి విఫలమైంది. ఉదయం మంచు ఎక్కువగా ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. మాజీ సర్పంచి పాలగుల్ల ప్రతాపరెడ్డి సంఘటనా స్థలం చేరుకొని నిరసన విరమించాలని మహిళలకు సర్ది చెప్పడంతో మహిళలు నిరసన విరమించారు. అనంతరం పోలీసులు ట్రాఫిక్ పునరుద్ధరించారు. ఈ విషయమై సిఐ సురేష్ మాట్లాడుతూ గడ్డం ఆనందు ఈత కొడుతూ నీళ్లు తాగి మరణించినట్టు పోస్టు మార్టం రిపోర్ట్ వచ్చిందని ఈ విషయం వారి బంధువులకు వివరించినప్పటికీ వినిపించుకోకుండా మొండిగా ప్రవర్తిస్తూ నిరసనలు ధర్నాలు నిర్వహిస్తున్నారని, పోస్టుమార్టం రిపోర్టుపై అనుమానం ఉంటే అధికారులను సంప్రదించి శాంతి యుతంగా సమస్య పరస్కరించుకోవాలని తెలిపారు.

స్టడీ మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి-రాచర్ల

రాచర్ల ఉన్నత పాఠశాలలో బుధవారం చిన్ని ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఎస్ఐ కోటేశ్వరరావు సహకారంతో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ కోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో కోటేశ్వరరావు, గిరిధర్ శర్మ, హెచ్ఎం బియల్ రామనాయక్, మాగులూరి శ్రీకాంత్, ఉపాధ్యాయులు, స్కూల్ చైర్మన్ గజ్జ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉపాధి కోసం వలస వెళ్తే..

భూమి కబ్జా చేశారు..!

తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న బాధితులు

ప్రజాశక్తి- సంతమాగులూరు

ఉపాధి కోసం ఇతర జిల్లాలకు పనికి వెళ్లి గ్రామానికి వచ్చేలోపే వారి పొలాలు కబ్జా చేసేశారు. మండలంలోని కొప్పరం గ్రామంలో గుంజి సుబ్బారావు, గుంజి కోటి వీరయ్యలకు కొప్పరం గ్రామంలో సర్వేనెంబర్ 591-జె-2 లో ఉన్న 80 సెంట్లు, మరియు సర్వేనెంబర్ 591-జె-1ఎ లో 6 ఎకరాల 68 సెంట్ల పట్టా భూమి మొత్తం 7.66 ఎకరాల సెంటర్ భూమి ఉంది. తమ తాతలనాటి భూమిని పది సంవత్సరాల క్రితమే తాము స్వాధీనం చేసుకొని తమ పేరు మీద రిజిస్ట్రేషన్ కూడా చేయించుకుని పట్టాదారు పాస్ పుస్తకాలు పొంది వున్నారు. ఆ భూమిలో వరి, జొన్న తదితర పంటలు చేసుకుంటూ ఉన్నారు. అయితే గతంలో సాగర్ జలాలు రాక సేద్యం చేయకపోవడంతో పొలాలు బీడులుగా మారాయి. దీంతో ఉపాధి కోసం తిరుపతికి వలస వెళ్లారు. ఇదే సాకుగా తీసుకున్న తమ ప్రక్కన చేపల చెరువులు సాగు చేస్తున్న కృష్ణాజిల్లా గుడివాడకు చెందిన చిట్టిబాబు, బుజ్జి బాబు అనేవారు బాధితులకు తెలియకుండానే స్వాధీనం చేసుకుని బుల్డోజర్లతో చదును చేసి అమ్మకానికి పెట్టారు. దీంతో గ్రామస్తుల ద్వారా విషయం



కబ్జా చేసిన భూమి

తెలుసుకున్న బాధితులు తమ భూములు కబ్జాకు గురయ్యాయని తెలుసుకొని ఆ భూములకు సంబంధించిన డాక్యుమెంట్లు చేతబట్టుకొని తహసీల్దార్ కె.రవిబాబును కలిసి తమ భూమిని కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. తమ భూమిని విడగొట్టి సర్వే రాళ్లు వేయించాలని నెల రోజులుగా రెవెన్యూ కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా అరిగేలా తిరుగుతున్నా పట్టించుకోవడంలేదని బాధితులు వాపోతున్నారు. రాజకీయ అండదండలతోనే తమ భూమిని చెరువుల వ్యాపారులు ఆక్రమించారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమ భూమిని ఇప్పించాలని వారు కోరుతున్నారు.

కారు అద్దాలు పగలగొట్టి చోరీ

రూ.1.20 లక్షల నగదు అపహరణ

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

రోడ్డుపై నిలిపి ఉంచిన కారు అద్దాలు పగలగొట్టి బ్యాగులో ఉన్న లక్ష ఇరవై వేల రూపాయల నగదును చోరీ చేసిన సంఘటన మంగళవారం మార్టూరులో జరిగింది. పోలీసులు, బాధితుడు తెలిపిన కథనం మేరకు.. బల్లికురవ మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన గ్రానైట్ వ్యాపారి మాలపాటి పోతురాజు తనకు తెలిసిన వ్యక్తి బైక్‌పై నుంచి పడటంతో ఆ వ్యక్తిని తీసుకొని మార్టూరు సబ్ రిజిస్ట్రార్ వద్ద ఉన్న సూపర్ మార్కెట్ ఎదురుగా కారు నిలిపి అక్కడకు సమీపంలోని రాము ఆర్థోపెడిక్ వైద్యశాలవద్దకు చికిత్స కోసం వెళ్లారు. ఈ క్రమంలో కారుని బైక్‌పై వెంబడించిన ఇద్దరు గుర్తుతెలియని బండరాయితో కారు అద్దాలు పగలగొట్టి అందులో నగదు ఉన్న బ్యాగ్‌ని నిమిషాల వ్యవధిలో తస్కరించి ఉడాయించారు. అద్దాలు పగలగొట్టడం గమనించిన స్థానికులు వెంటనే అప్రమత్తమై వారి వద్దకు వచ్చే సరికి వారు పారిపోయారు. స్థానికులు కారు యజమానికి సమాచారం ఇచ్చారు. అయన వచ్చి పరిశీలించి చూడగా కారులో ఉంచిన రూ.1. 20 లక్షల నగదు బ్యాగ్ చోరీకి గురైనట్లు గుర్తించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటన జరిగిన తీరుని పరిశీలించారు. సిసి ఫుటేజ్ ఆధారంగా నిందితులను త్వరలోనే గుర్తిస్తామని పోలీసులు తెలిపారు. కాగా కారులో పెద్దమొత్తంలో నగదు ఉండి ఉంటుందని భావించిన గుర్తుతెలియని దుండగులు బల్లికురవ నుంచే కారుని వెంబడించి మార్టూరులో పట్టపగలే చోరీకి తెగబడ్డారని స్థానికులు భావిస్తున్నారు.

మహిళా అక్షరాస్యతే లక్ష్యంగా పనిచేయాలి

ప్రజాశక్తి-తర్లుపాడు

మహిళా అక్షరాస్యతే లక్ష్యంగా పనిచేయాలని వయోజన విద్య సూపరిండెంట్ రవీంద్రారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన స్త్రీశక్తి భవనంలో వెలుగు ఏపీఎం రమేష్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో మహిళా వాలంటరీ టీచర్లకు ఉల్లాస్‌పై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో చక్రపాణి ప్రసాద్, రవీంద్రారెడ్డి, ఏపిఎం రమేష్‌లు మహిళా సంఘ సభ్యులకు పుస్తకాలు పంపిణీ చేసి, పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు గ్రూపులో ఉండి ఇప్పటికీ చదువు నేర్చుకొని మహిళలు ఉన్నట్లయితే ఉల్లాస్ విద్య ద్వారా అక్షరాస్యులు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏపీఎం రమేష్, అకౌంటెంట్ శ్రీదేవి, సీసీలు పాల్గొన్నారు.

కొత్తపట్నం: కొత్తపట్నం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ఉల్లాస్‌పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. వయోజన విద్య సూపర్‌వైజర్ పోతురాజు అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా ఉప సంచాలకులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు ఉల్లాస్ కార్యక్రమం ద్వారా అక్షరాభ్యాసం చేసి తద్వారా అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో తులసి కుమారి, ఏపీఎం విజయ కుమారి పాల్గొన్నారు.

కిలాడి లేడీ అరెస్టు

వృద్ధ మహిళలకు మత్తు మందు ఇచ్చి దొంగతనాలు

బంగారు ఆభరణాలు, టాబ్లెట్లు స్వాధీనం

కేసును ఛేదించిన పోలీసులను అభినందించిన ఎస్పి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

వృద్ధ మహిళలకు మత్తుమందు ఇచ్చి దొంగతనాలు చేసున్న కిలాడీ లేడిని అరెస్టు చేసి, బంగారాన్ని, టాబ్లెట్లను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. కేసును చాకచక్యంగా ఛేదించిన పోలీస్ అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఎస్‌పి వివరాలు వెల్లడించారు. గంటా ఎలిశమ్మ అలియాస్ నందం సుజాత అలియాస్ గంధం సుజాత గతంలో విజయవాడలో ఒక చోరీ కేసులో అరెస్టు అయ్యి జైలుకి వెళ్ళి వచ్చింది. ఒక టివి సీరియల్ చూసి నిద్ర మాత్రలు ఇచ్చి సులువుగా దొంగతనాలు చేయవచ్చని నిర్ణయించుకుంది. ఆమె ఆరోగ్యం బాగాలేక మానసిక వైద్యుని కలిసి చికిత్స తీసుకుని, నిద్ర పట్టడానికి నిద్ర మాత్రలు ప్రిస్క్రిప్షన్ తీసుకొని, వాటి ద్వారా మత్తు టాబ్లెట్లు తీసుకునేది. పెళ్లిళ్లకు, కార్యక్రమాలలో ఒంటరి వృద్ధ మహిళలని లక్ష్యంగా చేసుకొని వారికి మాయమాటలు చెప్పి వారికి నమ్మకం వచ్చేలా ఒకటి రెండు రోజులు వారి ఇంటికి వెళ్లేది. వారికి నిద్ర టాబ్లెట్లు ఎక్కువ మోతాదులో కూల్ డ్రింక్స్‌లో కలిపి ఇచ్చి వారు నిద్రపోయ్యాక ఒంటిపై ఉన్న బంగారు వస్తువులు దొంగతనం చేసేది. బంగారు షాప్‌లలో బంగారం కొనడానికి వెళ్ళి దొంగతనాలు చేస్తోంది. ఈ క్రమంలో నిందితురాలు టంగుటూరు, కొత్తపట్నం, ఒంగోలు తాలూకా, ఒంగోలు 1 టౌన్, ఒంగోలు 2 టౌన్, ఎన్‌జిపాడు, కందుకూరు పట్టన పోలీస్ స్టేషన్‌ల పరిధిలో 9 దొంగతనాలు, బంగారు షాప్‌లలో 2 దొంగతనాలు చేసింది. ఈ కేసుల్లో ఇద్దరు వృద్ధ మహిళలు మరణించారు.

కేసులను ప్రతిష్టాత్మకంగా తీసుకొని నేరాలు జరుగుతున్న తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. ఒంగోలు డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, సింగరాయకొండ సిఐ సిహెచ్ హజరత్తయ్య ఆధ్వర్యంలో టంగుటూరు ఎస్సై వి.నాగ మల్లేశ్వరరావు, సింగరాయకొండ ఎస్ఐ బి.మహేంద్రలతో నేరం జరిగిన తీరుని బట్టి లోతైన దర్యాప్తు చేయించి, ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసి గాలించారు. ఒంగోలు బాలాజీ నగర్‌లో నిందితురాలిని అరెస్టు చేసి ఆమె వద్ద నుంచి సుమారు రూ.35 లక్షలు విలువైన 460 గ్రాముల బంగారు ఆభరణాలు, నేరానికి వాడిన మత్తు ట్యాబ్లెట్లలను స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించటంలో ప్రతిభ కనపర్చిన ఒంగోలు డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, సింగరాయకొండ సిఐ సిహెచ్ హజరత్తయ్య ఆధ్వర్యంలో టంగుటూరు ఎస్సై వి. నాగ మల్లేశ్వరరావు, సింగరాయకొండ ఎస్ఐ బి.మహేంద్ర, పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్‌పి ప్రత్యేకంగా అభినందించారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి-పంగులూరు

మండలంలోని తూర్పు తక్కెల్లపాడులో మంగళవారం 13 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని వ్యక్తిని అరెస్టు చేసినట్లు అద్దంకి ఎక్సైజ్ సీఐ భవాని తెలిపారు. మేడ ఎలమంద అనే వ్యక్తి అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు సమాచారం వచ్చిందని, తనిఖీ చేసి అరెస్ట్ చేసినట్లు చెప్పారు. యలమందును బెయిల్‌పై విడుదల చేసినట్లు సిఐ భవాని తెలిపారు. ఈ విషయమై తూర్పు తక్కెల్లపాడు గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో బెల్టు షాపుల వల్ల మహిళలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు బెల్టు షాపులు లేకుండా చేయాలని కోరుతున్నారు.

రేపల్లె: రేపల్లె పట్టణంలోని 6వ వార్డులో డిఫెన్స్ మద్యాన్ని విక్రయిస్తున్న వ్యక్తిని ఎన్‌ఫోర్స్‌మెంట్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. రేపల్లె పట్టణానికి చెందిన తులసి హేమ కుమార్ డిఫెన్స్ మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తున్నారన్న సమాచారంతో ప్రొహిబిషన్ సిబ్బంది దాడులు నిర్వహించారు. 38 మద్యం బాటిళ్లు సీజ్ చేశారు. తులసి హేమ కుమార్‌పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు అధికారులు తెలిపారు.



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న సీఐ

ఆటో డ్రైవర్లకు అవగాహన

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండల పరిధిలోని ఆటో డ్రైవర్లకు సిఐ హాజరత్తయ్య కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా ఆర్‌సి, ఫిట్నెస్, డ్రైవింగ్ లైసెన్స్, ఆటో ఇన్సూరెన్స్ దగ్గర ఉంచుకోవాలన్నారు. జిల్లాలో తరచుగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని నిబంధనలను పాటించాలని హెచ్చరించారు.

రోడ్డు భద్రతా వారోత్సవాలు

ప్రజాశక్తి-మేదరమెట్ల

జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలలో భాగంగా బుధవారం మండలంలోని బొడ్డువానిపాలెంలో అద్దంకి రూరల్ సీఐ డి.మల్లికార్జునరావు, మోటార్ వెహికల్స్ ఇన్స్పెక్టర్ ప్రసన్నకుమారి, మేదరమెట్ల ఎస్సై మహమ్మద్ రఫీ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు.

దుకాణాల్లో తనిఖీ

ప్రజాశక్తి-కొండపి

కొండపిలోని రెండు కిరాణా షాపుల్లో బుధవారం ఒంగోలు తూనికల కొలతల శాఖ అధికారి అనిల్ తనిఖీలు చేపట్టారు. కాటాలు రెన్యూవల్ చేయని కారణంగా రెండు షాపులపై కేసు నమోదు చేశారు. అదేవిధంగా మెయిన్‌రోడ్డులోని రెండు రైస్ షాపులపై కేసులు నమోదు చేశారు. కాటాతో వ్యాపారం చేసే ప్రతి ఒక్కరూ సంవత్సరానికి రెన్యూవల్ చేసుకోవాల్సిందిగా తెలిపారు. వ్యాపారులు నియమ నిబంధనలను పాటించాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉచిత పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి - నిజాంపట్నం

మండలంలోని పుల్లమెరకలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రేపల్లె ఏడీ డాక్టర్ బి.నాంచారయ్య మాట్లాడుతూ ఆరోగ్య శిబిరాలను పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 200 గేదెలకు, 44 దూడలకు పురుగు మందులు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ ఎం.హేమ ప్రియ, ఎంపీటీసీ జి. రామారావు, కొక్కిలిగడ్డ ప్రభాకరరావు, సంగీతరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పెద్దారవీడు: పెద్దారవీడు మండలంలోని పుచ్చకాయలపల్లిలో పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశు వైద్య అధికారి డిఆర్ బాలునాయక్ మాట్లాడుతూ పశువుల ఆరోగ్య పరిరక్షణ, పాల ఉత్పాదకతను పెంచడానికి ఈ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వజ్రాల రామలక్ష్మమ్మ, కందుల పోలిరెడ్డి, పోతిరెడ్డి వీరారెడ్డి, సెక్రటరీ రామకోటమ్మ పాల్గొన్నారు.

గిడుగు రామ్మూర్తికి ఘన నివాళి

ప్రజాశక్తి-బాపట్ల

తెలుగు భాష వైతాళికుడు, వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి పంతులు అని ప్రజాకవి, ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎస్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం గిడుగు వెంకట రామమూర్తి 85వ వర్ధంతి సందర్భంగా సాహితీ భారతీ ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ అలుపెరగని కలం యోధుడు గిడుగు తెలుగు భాష అందరికీ అర్థమయ్యే రీతిలో అనుకూలమైన, యోగ్యమైన, అందరూ మాట్లాడే వ్యవహారిక భాష తెలుగు భాషేనని గిడుగు చాటి చెప్పారన్నారు. సంస్కృత భాషను తెలుగు ప్రజలు అర్థం చేసుకోవడం కష్టమని చెప్పిన గిడుగు రామ్మూర్తి పంతులు తెలుగువారి కోసం వ్యవహారిక భాష ప్రచారం కోసం, అందరికీ అర్థమయ్యే విధంగా తెలుగు మాస పత్రిక స్థాపించారన్నారు. సాహితీ భారతీయ అధ్యక్షులు రావూరి నరసింహ వర్మ మాట్లాడుతూ పసిపిల్లలకు, స్త్రీలకు, పేదవారికి, తెలుగు భాష రావాలన్నా, అర్థం అవ్వాలన్నా, అది వ్యవహారిక భాషతోనే సాధ్యమవుతుందని ఆయన చాటి చెప్పారన్నారు. పాఠ్య పుస్తకాలలో గ్రాంథిక భాషకు బదులు వ్యవహారిక భాషను ప్రవేశపెట్టడానికి ఎనలేని కృషి చేశారన్నారు. లిపిలేని సవర భాషకు లిపిని కనుగొన్నారన్నారు. సవర-ఆంగ్ల భాషా నిఘంటువును గిడుగు రూపొందించారన్నారు. ఆగస్టు 29న గిడుగు జయంతి "తెలుగు భాషా దినోత్సవం"గా ప్రకటించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మర్రి మాల్యాద్రి రావు, ఆదం షఫీ, ఎం. జాకబ్, కస్తూరి శ్రీనివాసరావు, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, కాళిదాసు పాల్గొన్నారు.



గిడుగు రామ్మూర్తికి నివాళులర్పిస్తున్న దృశ్యం

చేనేత కార్మికుల ధర్నాను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-భట్టిప్రోలు

చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి చేపట్టిన ధర్నాను విజయవంతం చేయాలని చేనేత కార్మిక సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి మురుగుడు సత్యనారాయణ పిలుపునిచ్చారు. భట్టిప్రోలులో బుధవారం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు నేత నేస్తున్న ప్రతి చేనేత కార్మికులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తును ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనెల 24వ తేదీన చీరాలలో చేనేత జౌళి శాఖ కార్యాలయం వద్ద జరగనున్న చేనేత కార్మికుల ధర్నా గురించి బుధవారం కార్మిక సంఘం నాయకులు భట్టిప్రోలులో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. అలాగే సహకార సంఘాలకు రావాల్సిన బగాయిలు వెంటనే విడుదల చేయాలని, త్రిష్ట పండు విడుదల చేయాలని, జిఎస్‌టిని ఎత్తివేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలనే డిమాండ్ల సాధన కోసం 24వ తేదీ శుక్రవారం అన్ని జిల్లా కేంద్రాలలో చేనేత కార్మికుల ధర్నా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి చేనేత కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దీపాల సత్యనారాయణ, భట్టిప్రోలు చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షులు బట్టు నాగమల్లేశ్వరరావు, నాయకులు ఆకురాతి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న చేనేత కార్మిక సంఘం నాయకులు

కిరణ్ మృతి పార్టీకి తీరని లోటు : మంత్రి

ప్రజాశక్తి-టంగుటూరు

జరుగుమల్లి మండలంలోని కె.బిట్రగుంట గ్రామానికి చెందిన టిడిపి నాయకులు యర్రా కిరణ్ దిశ దిన కర్మలలో, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు, ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి పాల్గొని నివాళులర్పించారు. కిరణ్ మృతి పార్టీకి తీరని లోటని మంత్రి స్వామి తెలిపారు. కిరణ్ కుటుంబ సభ్యులను మంత్రి స్వామి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జరుగుమల్లి టిడిపి అధ్యక్షులు పోకూరి రవీంద్రబాబు, నాయకులు దామచర్ల పూర్ణచంద్రరావు, లియాఖాత్, పోకూరి రవీంద్రబాబు, మలినేని పెరుమాళ్ళు, యస్దాని, బొడ్డు రమేష్, చాగంటి శ్రీహరి, జరుగుమల్లి మాజీ ఎంపిపి బెల్లం సత్యన్నారాయణ, పోటు శ్రీనివాస మురళి, కొండపి నియోజకవర్గ కార్యనిర్వాహక కార్యదర్శి బత్తిన పూర్ణ, టిడిపి ప్రధాన కార్యదర్శి నరాల సోమయ్య, కొమ్మాలపాటి కృష్ణ, రావి నాగేశ్వరరావు పలువురు నాయకులు పాల్గొన్నారు.



కిరణ్‌కు నివాళులర్పిస్తున్న మంత్రి స్వామి, ఎమ్మెల్యే జనార్ధన్, ఎంపి శ్రీనివాసులరెడ్డి

విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి-కొండపి

జంప్‌రోప్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులను మంత్రి స్వామి, ఎంపీ మాగుంట, కలెక్టర్ తమీమ్ అన్సారియా అభినందించారు. కొండపిలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు ఇటీవల నేపాల్‌లో జరిగిన పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించారు. బుధవారం ఒంగోలులో అంతర్జాతీయ స్థాయిలో గోల్డు మెడల్ సాదించిన విద్యార్థినుల అభినందించారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.అరుణ మాట్లాడుతూ 8వ తరగతి చదువుతున్న ఏ.కావ్య, కె.లక్ష్మీ ప్రణతి, ఇద్దరు జంప్‌రోప్ గేమ్ నందు నంద్యాలలో జరిగిన జంప్‌రోప్ స్టేట్ లెవల్ కాంపిటేషన్‌లో గోల్డు మెడల్ సాదించారని తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో మెడల్ సాదించిన విద్యార్థినులను పాఠశాల పీఈటీ బార్గవి, శిరోమణి, సిబ్బంది అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న మంత్రి స్వామి, ఎంపీ మాగుంట, కలెక్టర్ అన్సారియా



ఏర్పాట్లు పరిశీలిస్తున్న నాయకులు

26న ఎమ్మెల్యే ఏలూరి జన్మదిన వేడుకలు

పలు సేవా కార్యక్రమాలకు శ్రీకారం

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

పర్చూరు నియోజకవర్గ వ్యాప్తంగా ఈనెల 26న విజనరీ లీడర్ అవార్డు గ్రహీత, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు జన్మదినోత్సవ వేడుకలకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. టీడీపీ శ్రేణులు వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు సన్నద్ధమయ్యారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు, వైద్య శిబిరాలు నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన గ్రీన్ స్పార్క్ ఫౌండేషన్‌ను మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్‌లు ఆవిష్కరించనున్నారు.


ఏర్పాట్లు పరిశీలన...

ఎమ్మెల్యే ఏలూరి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 26న చేపట్టనున్న వేడుకలకు క్యాంపు కార్యాలయం సర్వసిద్ధమవుతోంది. వేలాదిమంది తెలుగుదేశం పార్టీ నాయ కులు, కార్యకర్తలు, అభిమానులు కూటమి నేతలు, పెద్ద ఎత్తున తరలిరానున్న నేపథ్యంలో ఎక్కడ లోటుపాట్లు లేకుండా చర్యలు చేపడుతున్నారు. క్యాంపు కార్యాలయంలో వైద్య శిబిరాలకు, సేవా కార్యక్రమాలకు వేరువేరుగా ఏర్పాట్లు చేపట్టారు. తెలుగుదేశం పార్టీ నాయకులు క్యాంప్ కార్యాలయం ప్రతినిధులు ఏర్పాట్లను పరిశీలించారు.

డ్రాయింగ్, పెయింటింగ్‌లో శిక్షణ

ప్రజాశక్తి-అద్దంకి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో దళితులకు డ్రాయింగ్ మరియు పెయింటింగ్‌లో శిక్షణ తరగతులు ఈనెల 24వ తేదీ నుండి 30వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు డైరెక్టర్ బాలకోటేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. శిక్షణలో విద్యార్థులకు భోజనం వసతోపాటు పెయింటింగ్ వివిధ రకాల వస్తువులను కూడా ఉచితంగా ఇవ్వబడతాయని ఆయన తెలిపారు. డ్రాయింగ్, పెయింటింగులో మంచి ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు అవార్డ్స్ అందించబడతాయన్నారు. ఉత్తర అద్దంకిలోని పాఠశాలలో నిర్వహించే ఈ శిక్షణకు ఆసక్తి కలిగిన విద్యార్థులు వివరాలకు 7981736648 నంబరులో సంప్రదించాలన్నారు.



నిర్వాహకుల నుంచి పురస్కారం అందుకుంటున్న ప్రభావతి

పద్మావతికి జాతీయ పురస్కారం

ప్రజాశక్తి-భట్టిప్రోలు

సాహితీవేత్త, నంది అవార్డు గ్రహీత దుంతు ప్రభావతి మంగళవారం వరల్డ్ రైటర్స్ ఫోరం, వరల్డ్ పోయెట్రీ అకాడమీ, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్, అంతర్జాతీయ సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారాన్ని అందుకున్నారు. బాపట్ల మండలం, భట్టిప్రోలుకు చెందిన సాహితీవేత్త, నంది అవార్డు గ్రహీత దొంతు ప్రభావతిని ఎంపిక చేసి విజయవాడలో పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా, శ్రీ శ్రీ కళావేదిక చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, కన్వీనర్ శ్రీమతి కొల్లి రమావతిలు పద్మావతిని అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు భాషాభివృద్ధికి, సాహితీ, కళా, సేవా రంగాలకు చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ అవార్డును ప్రదానం చేయడం జరిగిందన్నారు. దొంతు ప్రభావతి మరెన్నో ఉన్నత పురస్కారాలు పొందాలని పలువురు ప్రముఖులు ఆకాంక్షించారు.




కార్మికులకు యూనిఫాం అందజేస్తున్న కమిషనర్

పారిశుధ్య కార్మికులకు యూనిఫాం పంపిణీ

ప్రజాశక్తి-బాపట్ల

పట్టణంలో పారిశుధ్య విభాగంలో కార్మికులుగా విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి యూనిఫామ్ బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సిబ్బందికి అవసరమైన సదుపాయాలు కల్పిస్తామన్నారు. చలికాలంలో సిబ్బంది ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సి.హెచ్ కరుణ, డి.శ్రీనివాసరావు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.



సజ్జలను కలిసిన వరికూటి అశోక్ బాబు

పార్టీ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి-వేమూరు

వైసీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామ కృష్ణారెడ్డిని బుధవారం ఆయన నివాసంలో వరికూటి అశోక్‌బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. వైసీపీ అధికా ప్రతినిధిగా నియమించినందుకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ బలోపేతానికి నా బాధ్యతగా కృషి చేస్తానని ఈ సందర్భంగా అశోక్ బాబు పేర్కొన్నారు.



రంగారావును సన్మానిస్తున్న నేతలు

రంగారావు సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి-చీరాల

చేనేత పరిశ్రమకు రంగారావు సేవలు ప్రశంశనీయమని డాక్టర్ జాస్తి రంగారావు అన్నారు. చేనేత జన సమాఖ్య ఆధ్వర్యంలో జంద్రపేటలోని దేవాంగ కల్యాణ మండపంలో రాష్ట్ర చేనేత జన సమాఖ్య అధ్యక్షులు దేవన వీరనాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో డా. జాష్టి రంగారావు మాట్లాడారు. చేనేత పరిశ్రమకు మరియు చేనేత కార్మికులకు చేసిన కృషిని కొనియాడారు. రాష్ట్ర చేనేత జన సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షులు మాచర్ల మోహన్ రావు మాట్లాడుతూ డా. జాష్టి రంగారావు నిజమైన రాజకీయ నాయకుడన్నారు. ఈ కార్యక్రమంలో డా. సత్రం మల్లేశ్వరరావు, బీరక సురేంద్ర, చేనేత జన సమాఖ్య నాయకులు దేవన హేమ సుందంరావు, వావిలాల దాశరథి, మునగాల వెంకటేశ్వర్లు, లేళ్ళ భాస్కర్, గుత్తి సదాశివరావు, గుంటూరు మల్లికార్జునరావు మరియు ఓరుగంటి రెడ్డి జన సమాఖ్య ప్రతినిధులు, అసిస్ట్ ప్రతినిధులు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

ఒంగోలు నగర సమగ్రాభివృద్ధికి

నిధులు కేటాయించాలి : సిపిఎం

ప్రజాశక్తి- ఒంగోలు సిటీ

ఒంగోలు నగర సమగ్రాభివద్ధికి ప్రభుత్వం తక్షణమే నిధులు కేటాయించాలని సిపిఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు కోరారు. స్థానిక సుందరయ్య భవన్‌లో సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు జి.రమేష్ కలిసితో శ్రీనివాసరావు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఒంగోలు నగర అభివద్ధికి గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం చేసిన వాగ్దానాలు అమలు చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడు నెలలు పూర్తయినప్పటికీ అభివద్ధి వైపు కన్నెత్తి చూడలేదని ఆరోపించారు. తాగునీరు, పారిశు ధ్యం, ట్రాఫిక్, ఇళ్ల స్థలాలు తదితర సమస్యలపై శాశ్వత పరిష్కారానికి నిధులు మంజూరు చేసి ప్రణాళిక బద్ధంగా నగరాన్ని అభివద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ప్రతిరోజూ తాగునీరు అందిస్తామని చేసిన వాగ్దానాన్ని పాలకులు మరచిపోయారన్నారు. చేసిన వాగ్ధానం మేరకు రోజూ ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 7,8 గంటల లోపు తాగునీరు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. నగరంలో 18 ఓవర్ హెడ్ ట్యాంకులు, ఓ ఫిల్టర్ బెడ్, 650 మీటర్ల కొత్త పైపులైన్ నిర్మాణానికి రూ. 398 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. టెండర్ ప్రక్రియ కూడా పూర్తయినట్లు ప్రభుత్వం తెలిపిందన్నారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ చొరవ చూపి తాగునీటి సమస్య పరిష్కారానికి కషి చేయాలన్నారు. నగర శివారు కాలనీల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. నగరంలోని ఊరచెరువును మంచినీటి చెరువుగా అభివృద్ధి పరచి



మాట్లాడుతున్న చీకటి శ్రీనివాసరావు

వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. శివారు కాలనీలు, మురికివాడలు, విలీన ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. అందుకు అవసరమైన సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. నగరంలో ప్రతిరోజూ 150 టన్నులు చెత్త ఉత్పత్తి అవుతుండగా కేవలం, 120 టన్నులు మాత్రమే తరలిస్తున్నారని, మిగిలిన 30 టన్నులు చెత్త ఎక్కడికి అక్కడే పేరుకుపోతున్నట్లు తెలిపారు. పోతురాజు కాలువను అభివద్ధి పరచాలన్నారు. నగరంలో సుమారు లక్ష మందికి పైగా సొంత ఇళ్ల స్థలాలు లేవని, వారంతా అద్దె ఇళ్లల్లో నివసిస్తున్నట్లు తెలిపారు. అలాంటి వారికి రెండేసి సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. శివారు ప్రాంతాల్లోనూ, చెరువు కట్టలు, కాలువ కట్టలు, ఇతర ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదవారిని గుర్తించి వారికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలన్నారు.టిక్కో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలన్నారు. నగరంలో ఆక్రమణలు తొలగించి రోడ్ల విస్తరణకు చర్యలు చేపట్టాలన్నారు. పార్కుల సుందరీకరణ పేరుతో నిర్వహణ బాధ్యతలు ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం సరికాదని, నగరపాలక సంస్థే నిర్వహణ బాధ్యతలు చేపట్టాలన్నారు. శ్మశాన వాటికలను అభివృద్ధి పరచాలన్నారు. సుందరయ్య భవన్ రోడ్‌లో ఏర్పాటు చేసిన డివైడర్ ప్రక్రియ వల్ల రోగులకు ఇబ్బందిగా ఉందని. దీన్ని వెంటనే సరి చేయాలని కోరారు. నెల్లూరు బస్టాండ్, కొత్తపట్నం బస్టాండ్ కూడళ్ళలో ప్రయాణికుల సౌకర్యం కోసం బస్ షెల్టర్లు నిర్మించాలన్నారు. సహకార డైయిరీని తిరిగి ప్రారంభించాలన్నారు. నగరంలో దొంగతనాలు అరికట్టేందుకు పోలీసు గస్తిని పెంచాలన్నారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు జి. రమేష్ మాట్లాడుతూ సైడ్ కాలువలు ఆక్రమణల వల్ల వర్షం వస్తే నగరమంతా జలమయ మవుతుందన్నారు. డ్రైనేజీవ్యవస్థను వెలుగుపరచాలన్నారు. ఇటీవల కొప్పోలులో తాగునీరు, డ్రైనేజీ సమస్యపై ప్రజలు ఆందోళన చేపట్టారని, సమస్యపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలన్నారు. శివారు కాలనీల్లో 7,8 రోజులకు ఒకసారి తాగునీరు సరఫరా సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తాగునీరు సరఫరా చేసే ట్యాంకర్లకు బిల్లులు చెల్లించని కారణంగా, ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా నిలిచిపోయినట్లు తెలిపారు. జాతీయ రహదారి డైవర్షన్ రోడ్డు మరమ్మతు పనులు పూర్తి చేయాలన్నారు. నగరంలో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు.

ధరలు లేక.. అప్పులు తీరక..

- పడిపోయిన మిర్చి ధరలు
- ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి-యర్రగొండపాలె

రెండేళ్ల క్రితం మిర్చి ధర క్వింటా రూ.23 వేలు పలికింది. ఈ ధర చూసి రైతులు అధిక విస్తీర్ణంలో పంట సాగుచేశారు. తెగుళ్ల నుంచి తోటలను కాపాడుకున్నారు. ఇప్పుడు ధర పతనం కావడంతో లబోదిబో మంటున్నారు. మిర్చిని గుంటూరు మార్కెట్ యార్డుకు తీసుకెళ్లితే క్వింటా రూ.13 వేలు మాత్రమే పలికింది. దీంతో నివ్వెరపోయిన రైతులు పంటను వెనక్కి తీసుకొస్తే రవాణా చార్జీలు కూడా దండుగని భావించి ఆవ ధరకే అమ్ముకున్నారు. వ్యాపారులు మిర్చి కొనుగోలు సమయంలో అనేక అభ్యంతరాలు పెడుతున్నారు. సుదూర ప్రాంతం నుంచి వచ్చారు. ఎలాగైన పంటను అమ్ముకుంటారనే భావనతో ధరను ఇష్టం వచ్చినట్లు తగ్గిస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. పది క్వింటాళ్ళ మిరప కాయలు కోస్తే అందులో ఆరు క్వింటాళ్ళ తాలు (తెల్లకాయలు) వస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. వాటిని రూ.5 వేల నుంచి రూ.6 వేలకు మించి కొనుగోలు చేయడం లేదని చెబుతున్నారు.

దిగజారిన మిర్చి ధరలు..

లాభాలు వస్తాయని ఈ ఏడాది పశ్చిమ ప్రకాశంలోని యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, పెద్దదోర్నాల, పెద్దారవీడు, మార్కాపురం, తర్లుపాడు, పొదిలి, బేస్తవారిపేట, గిద్దలూరు, అర్ధవీడు, కంభం, రాచర్ల,కొనకనమిట్ల మండలాల రైతులు 45,813 ఎకరాల్లో మిర్చి పంటను సాగుచేశారు.పంటను కోసి కల్లాల్లో ఆరబెట్టారు. ధర పడిపోయింది. క్వింటా రూ. 12 వే లు నుంచి రూ. 13 వేలు పలుకుతుంది. గతంలో వ్యాపారులు రైతుల ఇళ్లకు వచ్చి మిర్చి కొనుగోలు చేసేవారు. ఇప్పుడు రైతులే వారి వద్దకు వెళ్లి అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.పెట్టుబడి పెరగడం, ధరలు లేక రైతులు భారీగా నష్టపోతున్నారు.

గతంలో మిర్చి ధరలు ఇలా..

2019-20, 2020-21లో మిర్చి ధర సగటున క్వింటాకు



తెల్లకాయలు ఏరుతున్న కూలీలు

రూ.12 వేలు లభించింది. 2021-22లో రూ.13వేలు, 2022-23లో రూ.20,500, 2023-24లో రూ.20వేలు లభించింది. 2024-25లో రూ.13 వేలకు పతనమైంది. గత ఏడాది జనవరి నుంచి ఈ ఏడాది జనవరి వరకు గరిష్ట సగటు ధర రూ.13 వేలు దాటలేదు. కరోనా సమయంలో కొంత ఇబ్బంది ఎదురైనా ఆ తర్వాత రెండేళ్ల పరిస్థితులు ఆశాజనకంగా ఉన్నాయి. 2024, 2025లో ధరల పతనం కొనసాగుతోంది. 2022, 2023 సంవత్సరాల్లో మార్కెట్లో ధరలు బాగా ఉండడంతో ఇదే తరహాలో ధరలు పెరుగు తాయని ఆశించి రైతులు మిర్చి సాగుపై ఆసక్తి చూపారు. గతేడాది జనవరి నుంచి ధరలు తగ్గడంతో కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసినా సరుకు కదలడం లేదు. 2023తో పోలిస్తే మేలైన రకాలకు క్వింటాకు రూ.10 నుంచి 15 వేల వరకు ధర తగ్గింది. మేలు రకాలు బాడిగ, దేవనారు డీలక్సు, తేజ వెరైటీలకు 2022, 2023 సంవత్సరాల్లో క్వింటా ధర గరిష్టంగా రూ.20 వేల నుంచి రూ.28 వేలు పలికింది.

నష్టాల బాటలో రైతులు

గత ఏడాది, ఈ ఏడాది సగటున కింటా ధర రూ.10 వేల నుంచి రూ.15 వేలు తగ్గింది. ఎకరాకు సగటున పది క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా. ధర తగ్గడంతో ఎకరాకు రూ. లక్ష నుంచి రూ.లక్షన్నర వరకు రైతులకు నష్టం వస్తోంది. గతేడాది ఇదే పరిస్థితి ఎదురైంది. ఈ ఏడాదీ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ఎకరాకు రూ.లక్షన్నర వరకు పెట్టుబడి పెట్టిన రైతులకు రెండేళ్ల క్రితం కనీసం లక్షన్నర వరకు లాభాలు వచ్చేవి. 2024లో ఎకరాకు రూ.లక్ష వరకు నష్టం వచ్చింది. 2025లోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ఎగుమతి ఆర్డర్లు తగ్గాయని, ఇతర రాష్ట్రాల్లో కూడా మిర్చి సాగు పెరిగిందని, అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ లేదని చెబుతూ గత కొంతకాలంగా మిర్చి ధరలను వ్యాపారులు తగ్గిస్తున్నారు.

మిరుప కాయలు తెల్లగా వస్తున్నాయి

పాశం వెంకట నారాయణ, మిర్చి రైతు, కుందంపల్లి



ఆరు ఎకరాల్లో మిర్చి పంట సాగు చేశా. తొలి కాపు కోసి పంట కల్లంలో అరబెట్టాను. గతంలో కురిసిన వర్షానికి కాయలన్నీ తడిచాయి. తొడేలు రాలి కాయలన్నీ తెల్ల కాయలుగా మారుతున్నాయి. వీటిని యార్డుకు తీసుకువెళితే క్వింట రూ.ఐదు వేలకు కూడా కొనే పరిస్థితి లేదు.

నష్టాలు తప్పేలా లేవు..

దుగ్గినేని ఓం నారాయణ, మిర్చి రైతు, వాదంపల్లి



ఐదు ఎకరాల్లో మిర్చిని సాగు చేశా. ధర తగ్గడంతో నష్టాలు తప్పేలా లేవు. పంట చేతికొచ్చి అమ్ముకునే తరుణంలో ధర పతనమైంది. దీంతో ఆశలపై నీళ్ల చల్లినట్లు ఉంది. రోజుకు రూ.500 చొప్పున కూలి ఇచ్చి కాయలు కోయించాము. ప్రస్తుతం ధరలు చూస్తే ఆందోళన తప్పడం లేదు.



రాత నాటికలోని ఓ సన్నివేశం

ఆలోజింపజేసిన 'రాత'

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యతను రాత నాటిక ఆలోజింపజేసింది. పివిఆర్ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న ఎన్‌టిఆర్ కళా పరిషత్ నాటకోత్సవాల్లో భాగంగా బుధవారం ఐదో రోజు వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ వారు పోలుదాసు శ్రీనివాస్ రచన దర్శకత్వంలో ప్రదర్శించిన సందేశాత్మక రాత నాటిక సామాజిక చైతన్యాన్ని నింపింది. పారిశ్రామిక కాలుష్యంతో పర్యావరణ దెబ్బతినడం, దీంతో ఊపిరితిత్తుల వ్యాధుల బారిన పడటం, ప్రజలు ప్రాణాలు కోల్పోవడం,. ఆరోగ్య కార్యకర్తగా పనిచేస్తున్న కీర్తి తన సామాజిక కర్తవ్యంగా కాలుష్యానికి కారణమైన పరిశ్రమ గురించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వడం. యాజమాన్యం ఆమెను యాక్సిడెంట్ పేరుతో అంతం చేయడం. భర్త గోవర్ధన్ అదే సామాజిక కర్తవ్యం కోసం కషి చేయడం. తల్లిని పోగొట్టుకున్న కుమార్తె స్వప్నిక భవిష్యత్తు గురించి ఆందోళన చెందటం లాంటి పరిణామాల్లో అదే సామాజిక కర్తవ్యాన్ని కుమార్తె తన కర్తవ్యంగా భావించడం. పారిశ్రామిక కాలుష్య నివారణకు కుమార్తె నిర్వహించిన పాత్ర, ప్రాణాలు పోయే దశలో టీవీ మాధ్యమాల ద్వారా ప్రసారం చేయటం స్పందించిన ప్రభుత్వం పరిశ్రమను మూసివేయడం, స్వప్నిక పాత్ర ప్రదర్శించిన తీరు ఉత్కంఠంగా సాగింది. పర్యావరణ కాపాడుకోవడం సామాజిక కర్తవ్యంగా సమాజం రాతను మార్చే యజ్ఞంలో ప్రతి ఒక్కరూ ముందుండాలని రాత నాటిక సందేశాన్ని ఇచ్చింది. ఇందులో నటించిన కళాకారులు తమ పాత్రలకు జీవం పోశారు . తొలుత దేవరపాలెం దేవకుమార్ నాదస్వర బందం వారు ప్రదర్శించిన నాదస్వరం ఆకట్టుకుంది. ఒంగోలు శ్రీ ప్రసన్నాంజనేయ మహిళా కోలాటం వారు నిర్వహించిన కోలాట ప్రదర్శన, దర్శి జిల్లా పరిషత్ హై స్కూల్ వారి కోలాటం ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కళాకారులను నిర్వాహకులు ఈదర హరిబాబు, శివప్రసాద్ అభినందించారు



కలెక్టర్‌కు పుష్పగుచ్చం అందజేస్తున్న తహశీల్దారు

కలెక్టర్‌ను కలిసిన తహశీల్దారు

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా : జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి వద్ద సిసిగా విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ తహశీల్దారు నాగరాజు తహ శీల్దారుగా ఉద్యోగోన్నతిపొందాడు. అందులో భాగంగా కలెక్టర్ వెంకటమురళిని బుధవారం మర్యాద పూర్వ కంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మండల పరిధిలోని చింతల, మర్రిపాలెం గ్రామాలలో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా మినుము, జొన్న, మిరప పంటలను ఎఒ జవహర్‌లాల్ నాయక్ సందర్శించారు. ప్రస్తుతం వ్యవసాయ శాఖ ద్వారా రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ ద్వారా ప్రతి రైతుకు గుర్తింపు కార్డులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విఎఎ పరిపూర్ణ, విహెచ్ఎ నాయక్, రైతులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలి



మాట్లాడుతున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

ప్రజాశక్తి-దర్శి

రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని దర్శి పట్టణ, గ్రామీణ ప్రజలకు తాగునీరు అందించే నెదర్లాండ్ స్కీం ఫిల్టర్ బెడ్‌ల మరమ్మత్తు పనులను పూర్తి చేయాలని టిడిపి ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి కోరారు. ఒంగోలులోని ప్రకాశం భవన్‌లో కలెక్టర్ కార్యాలయంలో మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామి అధ్యక్షతన ఏర్పాటు చేసిన జిల్లా సమీక్షా సమావేశంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డితోపాటు పలువురు శాసన సభ్యులు పాల్గొన్న అభివృద్ధి సమీక్షా సమావేశంలో డాక్టర్ లక్ష్మి వివిధ అంశాలపై మాట్లాడారు. దర్శిలోని నెదర్లాండ్ స్కీము, చందవరం, పొట్లపాడు, ముండ్లమూరు, కురిచేడు వాటర్ హెడ్ వర్క్ పూర్తి చేసి తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. నెదర్లాండ్ స్కీము ఫిల్టర్ బెడ్లను శుభ్రం చేసి వేసవి నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై జిల్లా మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, కలెక్టర్ మాట్లాడుతూ వేసవిలో నీటి ఎద్దడి లేకుండా ప్రణాళికా బద్ధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. దర్శి ప్రాంతంలోని సమస్యను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను దర్శి వాటర్ స్కీం పని తీరును పరిశీలించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్లో మరమ్మత్తులు చేపట్టాలని కోరారు. మరమ్మత్తులకు అవసరమైన నిధులు మంజూరైనట్లు మంత్రి తెలిపారు. హాస్టళ్ల మరమ్మత్తులకు రూ.కోటి మంజూరైనట్లు అధికారులు తెలిపారు. కురిచేడులో ఎస్సీ బాలికల హాస్టల్ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వాసుపత్రుల్లో వస్తువులు మెరుగుపరిచి రోగులకు సక్రమంగా వైద్య సేవలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం గది లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వెంటనే నిర్మాణం చేపట్టాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. సంబంధిత మెడికల్ అండ్ హెల్త్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. దర్శి సమగ్ర అభివృద్ధి ధ్యేయంగా వివిధ అంశాలను సమావేశంలో డాక్టర్ లక్ష్మి మంత్రి, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.



శ్రీనును పరామర్శిస్తున్న బూచేపల్లి శివప్రసాదరెడ్డి

శ్రీనుకు బూచేపల్లి పరామర్శ

ప్రజాశక్తి - దర్శి

మండలంలోని జముకులదిన్నె గ్రామానికి చెందిన గోరంట్ల శ్రీను ఇటీవల ప్రమాదంలో గాయపడి వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న శాసన సభ్యులు, వైసిపి జిల్లా అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి బుధవారం వైద్యశాలకు వెళ్లి పరామర్శించారు.

నామినేటెడ్ పదవుల్లో దళితులకు ప్రాధాన్యత

ప్రజాశక్తి-దర్శి

దళితనాయకుల విజ్ఞప్తిని పరిగణంలోకి తీసుకొని మొట్టమొదటిసారి దర్శి ఎఎంసీ చైర్మన్ పదవిని ఎస్సీలకు ప్రకటించే అవకాశం ఉన్నట్లు సిఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు యోచిస్తున్నట్లు సమాచారం. నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపించిన టిడిపి ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి, లలితసాగర్‌కు దర్శి నియోజకవర్గ, రాష్ట్ర దళితసేన, ప్రజాసంఘాల తరపున రాష్ట్రదళిత సేన, దర్శి నియోజకవర్గం ప్రతినిధి గర్నెపూడి ప్రేమ్‌కుమార్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నామినేట్ పదవుల్లో దళితులు ముందడుగు వేయాలనే ఉద్దేశంతో దర్శిని ఎస్సీలకు కేటాయించటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. 2024లో మహర్షి ఏకలవ్యుని జయంతి సభ సందర్భంగా తహశీల్దార్ ప్రాంగణంలో గొట్టిపాటి లక్ష్మి హాజరైన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేకంగా ప్రకాశం జిల్లా కలెక్టర్, ఎస్సీ, ఎస్టీ, దళితవాడలపై రాష్ట్ర ప్రభుత్వ అమలు చేస్తున్న సబ్‌ప్లాన్ చట్టంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకోవటం ప్రత్యేక అభినందనలు తెలిపారు. దర్శి ఏఎంసీ చైర్మన్ పదవి ఎస్సీలు కేటాయించడంపట్ల రాష్ట్ర దళిత సేన నియోజకవర్గ అధ్యక్షులు గర్నెపూడి ప్రేమ్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు.

శ్రీశైలం బస్సును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-దర్శి

అద్దంకి నుండి శ్రీశైలంకు ముండ్లమూరు, తాళ్ళూరు, తూర్పుగంగవరం, బొద్దికూరపాడు, రాజంపల్లి, పొదిలి ఎక్స్‌ప్రెస్ బస్‌సర్వీస్‌ను గత 20రోజులుగా నిలిపేశారని, తిరిగి రెగ్యులర్‌గా నడపాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. అద్దంకి నుండి శ్రీశైలం వెళ్ళేటట్లు, తిరుగు ప్రయాణంలో శ్రీశైలం నుండి అద్దంకికి ఒంగోలు మీదుగా వెళ్ళేటట్లు చర్యలు తీసుకోవాలని కోరుతూ అద్దంకిడి డిపో మేనేజర్‌కు విన్నవించుకున్నట్లు తెలిపారు. అద్దంకి డిపోకు చెందిన అద్దంకి నుండి శ్రీశైలం ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌ను 5నెలల నుండి నడుపు చున్నారు. ఈ బస్ ద్వారా అద్దంకి, ముండ్లమూరు, తాళ్లురు, దర్శి, పొదిలి మండలాల పరిధిలోని ముండ్లమూరు, తాళ్ళూరు, మాధవరం, తూర్పుగంగవరం, నాగంబోట్లపాలెం, బొద్దికూరపాడు, కొత్తపల్లి, రాజంపల్లితోపాటు 10 గ్రామాల ప్రయాణీకులు శ్రీశైలం వెళ్ళుచూ శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామిని ఏంతో ఆనందంగా దర్శించుకొనుచున్నారు. ప్రయాణీకులు బాగా అలవాటుపడిన తరుణంలో గత 20 రోజుల నుండి బస్ సర్వీస్‌ను నిలుపుదల చేశారు. దీనివల్ల ప్రయాణీకులు బాగా ఇబ్బంది పడుతున్నారు. కావున ప్రయాణికుల కోరిక మేరకు వెంటనే సర్వీస్‌ను పునరుద్ధరణ చేయాలని కోరుతున్నారు.

అంగన్‌వాడీ ఎంపిక వాయిదా

ప్రజాశక్తి - కురిచేడు

కురిచేడులోని ఎస్‌ఎస్సి కాలనీ అంగన్వాడి కార్యకర్త ఎంపిక గురువారం జరగాల్సి ఉండగా అనివార్య కారణం వల్ల వాయిదా వేసినట్లు దర్శి ఐసిడిఎస్ అధికారిణి సిహెచ్ భారతి తెలిపారు. తేదీని తర్వాత ప్రకటిస్తామని తెలిపారు. మిగిలిన పోస్టులకు యధావిధిగా ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు.

నాగంపల్లిలో పశు వైద్యశిబిరం



టీకాలు వేయిస్తున్న మాజీ ఉపాధ్యక్షులు వెంకటేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండలంలోని గొట్లగట్టు పశు వైద్యశాల పరిధిలోని నాగంపల్లిలో పశువైద్యాధికారి వి రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాన్ని మండల మాజీ ఉపాధ్యక్షులు, టిడిపి నాయకులు సానికొమ్ము వెంకటేశ్వర్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని కూటమి ప్రభుత్వం పశు ఆరోగ్య వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయటం అభినందనీయమని అన్నారు. వ్యాధులు సంభవించకుండా ముందస్తుగా కాపరులు టీకాలు వేయించుకోవాలని సూచించారు. పశు కాపరులు తప్పని సరిగా జీవాలకు బీమా చేయించుకున్నట్లయితే ఏదైనా అనుకోకుండా ప్రమాదాలు సంభవించినప్పుడు కాపరులు నష్టపోకుండా ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించినట్లు తెలిపారు. పశువైద్యాధికారిణి వి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం పశుపోషకులకు, కాపరులకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించేందుకు వైద్య శిబిరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జీవాలకు వ్యాధి సోకిన వెంటనే వైద్యాధికారిని సంప్రదించి సలహాలు, సూచనలు తీసుకొని టీకాలు వేయించుకోవటం మంచిదన్నారు. అనంతరం పశువులకు టీకాలు, సూడి పరీక్షలు నిర్వహించారు. పశువులు, గొర్రెలకు నట్టల నివారణ మందు తాపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో లైవ్ స్టాక్ అసిస్టెంట్ వరలక్ష్మి, పశు సంవర్ధక సహాయ సంచాలకులు మెగావత్ శివాజీనాయక్, శ్రీనివాసులు, కాసు వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

సిఎస్.పురం : ప్రస్తుత సీజన్లో పశువులకు వచ్చే వ్యాధులు పట్ల పశు పోషకులు అవగాహన కలిగి ఉండాలని రేగులచిలుక సర్పంచ్ బత్తుల రమణయ్య, కృష్ణకుమారి తెలిపారు. మండలంలోని రేగులచిలుక, అయ్యలూరివారిపల్లి గ్రామాల్లో బుధవారం పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాధులు సోకిన పశువులకు టీకాలు వేశారు. ప్రస్తుత సీజన్లో గాలికుంటు, మూతి పుండు వంటి వ్యాధులు ప్రబులుతున్నాయని తెలిపారు. వాటికి ముందస్తుగానే వ్యాక్సిన్ చేయించుకోవాలని రైతులకు సూచించారు. శిబిరంలో పశువులకు అవసరమైన మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు కుక్క తిరుపతయ్య, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.



గేదెలకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది



మల్లవరపు జాన్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎంఇఓ

మధురకవి మల్లవరపు జాన్‌కు నివాళి

ప్రజాశక్తి-దర్శి

స్థానిక ఎంపిడిఓ కార్యాలయ ప్రాంగణంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద మధురకవి, ఉభయ భాష ప్రవీణా మల్లవరపు జాన్ 98వ జయంతి ఎకెఎన్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత, బహుజన కవి అట్లూరి రామారావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఎంఇఓ-2 రమాదేశి మాట్లాడుతూ మల్లవరపు జాన్ రచనలను గుర్తు చేశారు. జాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పురుషులు చేసిన పుణ్యమెటిదో ఎప్పుడును మానభంగాలకు గురైపోయిన జాడలేదని స్త్రీవాదిల కన్నెర్రజేసి సాహిత్య సేద్యం చేసిన ప్రసిద్ధి కవి మల్లవరపు జాన్ అని కొనియాడారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం శ్రీనివాసరావు, మధుర కవి జాన్ గురించి బహుజన కవి అట్లూరి రామారావు సంకలనం చేసిన వ్యాస ప్రతులను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంఇఎఫ్ జిల్లా కార్యదర్శి టి శేషయ్య, ఎపిటిఎఫ్ జిల్లా నాయకులు బి నాగార్జున, విక్రమ్, యుటిఎఫ్ నాయకులు ఎస్‌కె చిన్నఖాశిం, సీనియర్ ప్రధానోపాధ్యాయులు వి రాఘవరావు, సహజ విమర్శకులు ఎంఇఎఫ్ నాయకులు పి కమలాకర్, కాంట్రాక్ట్ బేసెస్, ఉద్యోగ సంఘ నాయకులు ఆర్ ఏసోబు పాల్గొన్నారు.



డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్ఐ జి కోటయ్య

ఆటో డ్రైవర్లకు అవగాహన

ప్రజాశక్తి - పీసీపల్లి

ఆటో డ్రైవర్లు పరిమితికి మించి కూలీలను ఎక్కించవద్దని ఎస్ఐ జి కోటయ్య తెలిపారు. మండలంలోని పెద అలవలపాడు వద్ద పరిమితికి మించి కూలీలతో వెళ్తున్న ఆటోలు ఆపి కౌన్సిలింగ్ ఇచ్చారు. పరిమితికి మించి ఎక్కించినప్పుడు ప్రమాదాలు జరిగితే ప్రభుత్వం నష్టపరి హారం ఇవ్వదని అన్నారు. పచ్చాకు ట్రాక్టర్లకు రెండు వైపులా తలుపులు తెరిచి కూలీలను ఎక్కించవద్దని అన్నారు. పచ్చాకు లోడు మీద కూడా కూలీలను ఎక్కించవద్దని హెచ్చరించారు. తమహెచ్చరికలను లెక్కచేయకుండా నిర్లక్ష్యంగా నడుపుతున్న ఆటో, ట్రాక్టర్ డ్రైవర్లకు మోటర్ వాహన చట్టం ప్రకారం కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తామని హెచ్చరించారు.

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా నూతన భవనాలు

- అనువుగాని చోట సచివాలయాల ఏర్పాటు
- రాజకీయ జోక్యంతో నిరుపయోగమైన సచివాలయాలు



సచివాలయ భవనం

ప్రజాశక్తి - కురిచేడు

కురిచేడులోని సచివాలయం -2 అసాంఘిక కార్యక్రమాలకు నిలయాలుగా మారింది. గతేడాది డిసెంబర్ 9న అప్పటి శాసన సభ్యులు మద్దిశెట్టి వేణుగోపాల్ చేతుల మీదుగా రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయం, విలేజ్ క్లినిక్‌లను ప్రారంభించారు. అయితే ఈ కేంద్రాలు కురిచేడుకి 6కిలోమీటర్లు దూరంలోని పేరంబొట్లపాలెం, కాటంవారిపల్లె, గొల్లపాలెం గ్రామాలకు చెందిన ప్రజలకు ఉపయోగపడాలని నిర్మాణం చేపట్టారు. వాస్తవంగా అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ప్రజల వద్దకు పాలనని చెప్పి సచివాలయాల ఏర్పాటు ద్వారా వాలంటీర్ వ్యవస్థ, సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా తీసుకొచ్చారు. కానీ దాని విరుద్ధంగా రాజకీయ నాయకుల జోక్యంతో గ్రామ ప్రజలకు అందుబాటులో లేనిచోట రూ.60లక్షల వ్యయంతో మూడు కేంద్రాలు నిర్మాణం చేపట్టారు. నిర్మాణాలు పూర్తయ్యాయే కానీ అప్పటి నుండి ఇప్పటి వరకు ఆ సచివాలయాల్లో కార్యకలాపాలు మొదలు కాలేదు. ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా వాయిదా వేశారేతప్ప వినియోగంలోకి తేవడం లేదు. సచివాలయం-1 కురిచేడు పంచాయితీ కార్యాలయం వెనుక మూడు భవనాలు నిర్మించారు. వాటిని పేరంబొట్లపాలెం, కాటంవారిపల్లె, గొల్లపాలెం తదితర గ్రామాలకు కేటాయించి ప్రస్తుతం నిర్మించి ఉన్న సచివాలయ-2ను కురిచేడుకి ఉపయోగిస్తే ఈ భవనాలు ఏమన్నా ఉపయోగంలోకి రావచ్చు. కానీ యధావిధిగా ఆ గ్రామ ప్రజలకు అక్కడకు వచ్చి పనిచేయించుకోవాలని అధికారులు చేస్తే మాత్రం ఆ భవనాలు శిథిలావస్థకు చేరడమే గానీ ఉపయోగంలోకి వచ్చే అవకాశమే లేదు. అప్పటి వరకు జూదరలు, త్రాగుబోతుల అసాంఘిక కార్యక్రమాలు చేపట్టేవారికి ఈ భవనాలు నిలయాలుగా మారాయి. ఇప్పటికైనను జిల్లా అధికారులు జోక్యం చేసుకొని ఈ భవనాలను వినియోగంలోకి తీసుకొస్తారని ఆశిద్దాం.



ఎరువుల విక్రయ కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ఆనందబాబు

ఎరువుల విక్రయ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-వేమూరు

వేమూరు మార్కెట్ యార్డ్ కమిటీ ఆవరణలో ది గుంటూరు జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఎరువుల విక్రయ కేంద్రాన్ని బుధవారం ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఏరువులు అందుబాటులోకి తీసుకురావడం వల్ల సకాలంలో పంటలు పండించగలుగుతారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రైతులకి భరోసా ఉంటుందన్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వం, నాయకులు మార్కెట్ యార్డ్‌లో దోచుకోవటం తప్ప కనీసం రెండు మీటర్ల రోడ్డు కూడా వేయలేదని విమర్శించారు.



పుస్తకాలతో విద్యార్థులు

పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-పంగులూరు

మండలంలోని నూజిల్లపల్లిలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు ఇంగ్లీష్ గ్రామర్ పుస్తకాలను పంపిణీ చేశారు. తాటి ఇందిరా మెమోరియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ (టైమ్స్) తరపున పూనాటి రవీంద్ర, తాటి సరోజినీలు గురువారం ఈ పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. గత నాలుగు సంవత్సరాల నుంచి టైమ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ తరపున విద్యార్థులకు గ్రామర్ పుస్తకాలు అందిస్తున్నారని, అదేవిధంగా ఈ సంవత్సరం కూడా గ్రామర్ పుస్తకాలను విద్యార్థులకు అందించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేమా వీరాంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా టైమ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రతినిధులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థులు ఈ గ్రామర్ పుస్తకాలను సద్వినియోగం చేసుకొని చక్కగా చదువుకోవాలని ఆయన కోరారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-మార్టూరు

కందులు, మినుములు, మొక్కజొన్న పంట ఉత్పత్తుల కొనుగోలుకు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కందిమల్ల రామ కోటేశ్వరరావు తెలిపారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో రైతు సంఘం మండల కమిటీ సమావేశం బుధవారం నాడు పేరుని నాగేశ్వరరావు అధ్యక్షన జరిగింది. ఈ సమావేశంలో కందిమల్ల రామకోటేశ్వరావు మా ట్లాడుతూ ప్రకటించిన మద్దతు ధరకు పంటలను కొనుగోలు చేయాలని తెలిపారు. వరి ధాన్యం క్వింటాలుకు రూ.2,340, కందులు రూ.7,550, మినుములు రూ.7,400, మొక్కజొన్నలు రూ.2,340 ఆర్ఎస్కే కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని అన్నారు. గత ప్రభుత్వం చేసిన సర్వేను రద్దు చేసి పాత పాస్ పుస్తకాల ఆధారంగా రెవెన్యూ రికార్డులు ప్రకారం రైతుల అభిప్రాయాలను తెలుసుకోవాలన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా పిలుపుమేరకు జనవరి 26వ తేదీన దేశవ్యాప్త పిలుపులో భాగంగా ట్రాక్టర్లో మోటర్ బైక్‌ల ర్యాలీ నిర్వహించి నిరసన తెలియజేయాలని ఏకగ్రీవంగా తీర్మానించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఈ నాగేశ్వరరావు, బి.కృష్ణమూర్తి, వై.రాంబాబు, బి.సూరిబాబు, మోహన్ రావు, డి.సాంబశివరావు, శేషాద్రి, ఎన్.సాంబయ్య, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

అనుమతి రాగానే ఆన్‌లైన్ సైట్ ప్రారంభిస్తాం

దళిత నేత నీలంతో మంత్రి స్వామి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ కార్పొరేషన్ల రుణాలకు దరఖాస్తు చేసుకునే సైట్‌ను ఆర్థిక శాఖ అనుమతి రాగానే ప్రారంభిస్తామని మంత్రి స్వామి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల సమీక్షకు హాజరైన మంత్రి స్వామితో దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు కార్పొరేషన్ రుణాలపై చర్చించారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ కార్పొరేషన్ల లోన్ యూనిట్ల సంఖ్యను పెంచాలని, రుణాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఆన్‌లైన్ సైట్ తెరవాలని కోరారు. బ్యాంకు లింకు రుణాలతో పాటు, కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి బ్యాంకులతో సంబంధంలేని ఎన్ఎస్ఎఫ్‌డిసి, ఎన్ఎఫ్ఎస్‌పిసి రుణాలను ఇచ్చేందుకు యాక్షన్ ప్లాన్ రూపొందించాలన్నారు. స్పందించిన మంత్రి డిబివి స్వామి మాట్లాడుతూ, గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం ఒక్క రుణం ఇవ్వలేదని, కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో చెప్పిన విధంగా తాము రుణాలు ఇస్తున్నామన్నారు. ఫైనాన్స్ క్లియరెన్స్ కోసం ఎదురు చూస్తున్నామని, అనుమతి రాగానే దరఖాస్తులు తీసుకొని రుణాలు మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, యర్రగొండపాలెం ఇన్‌చార్జి గూడూరు ఎరిక్షన్ బాబు ఉన్నారు.



మంత్రి స్వామితో మాట్లాడుతున్న నీలం నాగేంద్రరావు

అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష

ప్రజాశక్తి - పంగులూరు

పంగులూరు మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై మండల ప్రత్యేక అధికారి ఎం.అనంతరాజు బుధవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. పంగులూరు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో పెన్షన్ల పంపిణీపై అధికారులను ఆరా తీశారు. పంపిణీలో వస్తున్న ఇబ్బందులను గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం పంచాయతీరాజ్‌శాఖ అధికారి గడ్డం హనుమంతరావు మాట్లాడుతూ మండలంలో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ పనులు జరుగుతున్నట్లు తెలిపారు. ఈ పనులను వెంటనే పూర్తి చేయాలని స్పెషల్ ఆఫీసర్ అనంతరాజు ఆదేశించారు. లక్ష గృహాలు కార్యక్రమంలో భాగంగా మండలంలో 111 గృహాలు పూర్తి చేయాల్సి ఉండగా, వాటిలో ఎన్ని గృహాలు పూర్తి చేశారని స్పెషల్ ఆఫీసర్ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో స్వరూప రాణి, ఈవోఆర్‌డి సుమంత్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ శివయ్య, హౌసింగ్ ఏఈ కిషోర్ కుమార్, మండల స్థాయి అధికారులు, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

శనగలో పురుగు నివారణకు చర్యలు తీసుకోవాలి

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి-అద్దంకి

శనగ పంటలో శనగ పచ్చ పురుగు నివారణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకట కృష్ణ సూచించారు. మండలంలోని నాగులపాడు, వేలమూరిపాడు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏవో మాట్లాడుతూ రబీలో సాగు చేసిన శనగ పంట ప్రస్తుతం పూత మరియు పిందె దశలో ఉందన్నారు. రైతులు ఈ-పంటలో తమ పంటలను నమోదు చేసుకోవాలని సూచించారు. త్వరలో ప్రతి రైతుకి ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయబోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు అనూష, వ్యవసాయ విస్తరణ అధికారి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పర్చూరు: మండలంలోని తిమ్మరాజు పాలెం, చిన నందిపాడు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం ఏవో రామ్మోహనరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ ఎన్.మోహనరావు మాట్లాడుతూ శనగపంటలో వచ్చు ఎండు తెగుళ్లు, వేరుకుళ్ళు తెగులు నివారణకు రైతులు తప్పనిసరిగా పంట మార్పిడి విధానం చేయాలని తెలిపారు. పొగాకు పంటలో రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు, ఈ కార్యక్రమంలో ఏవో రామ్మోహనరెడ్డి, ఆదర్శ గ్రామ రైతులు, విఏవోలు గిరీ, ఝాన్సీ రైతులు పాల్గొన్నారు.

కారంచేడు: మండలంలోని కారంచేడు, కుంకలమర్రు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కారంచేడు మండల వ్యవసాయ అధికారి సుధీర్ బాబు, గ్రామ వ్యవసాయ సహాయకులు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

వేమూరు: మండలంలోని చంపాడు, భూతుమల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో బాపట్ల రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ అక్టర్ హుస్సేన్ మాట్లాడుతూ జొన్న, మొక్కజొన్నలో యజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. ఏవో చందవోలు సునీత మాట్లాడుతూ జొన్న, మొక్కజొన్నలో కలుపు నివారణ గురించి వివరించారు.

చెరుకుపల్లి: అపరాల సాగులో పల్లాకు తెగులు అక్కడక్కడ కనిపిస్తుందని దీని నివారణకు చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ శాఖ అధికారి అవ్వారు మహేష్ బాబు రైతులకు సూచించారు. పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆరేపల్లి తూర్పు పాలెం గ్రామపంచాయతీల పరిధిలో రైతుల పొలాలు పరిశీలించి పలు సూచనలు సలహాలు అందజేశారు. అదేవిధంగా అపరాలు పూత దశలో బూడిద తెగులు కనిపిస్తుందని దీని నివారణకు చర్యలు చేపట్టాలని రైతులకు తెలిపారు.

పెద్దారవీడు: మండలంలో బి.చెర్లోపల్లి, రామాయపాలెం, రైతు సేవా కేంద్రం రైతు పొలాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి కె.బుజ్జిబాయి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కంది, వరిగ పంటను సందర్శించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.బుజ్జిబాయి, రైతులు పాల్గొన్నారు.

కొండపి: కొండపి మండలంలోని నెన్నూరుపాడు, గుర్రపడియలో ఏవో డి.విజయకుమార్ అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతులతో కలిసి క్షేత్ర స్థాయిలో రబీ సీజన్‌లో వేసిన కంది మరియు వరి పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమములో గ్రామ వ్యవసాయ సహాయకులు జ్యోష్ణ, వెంకట్రావు మరియు రైతులు పాల్గొన్నారు.

24 నుంచి బ్యాడ్మింటన్ పోటీలు

ప్రజాశక్తి - నగరం: నగరంలో శ్రీ వెలగపూడి రామకృష్ణ స్మారక కళాశాలలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర కళాశాలల బాల్ బ్యాడ్మింటన్ (మెన్) టోర్నమెంట్ ఈ నెల 24 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చయ్య చౌదరి మరియు ప్రిన్సి పల్ డాక్టర్ అనగాని హరికృష్ణ తెలియజేశారు.

వైసీపీ కార్యకర్తకు పరామర్శ

ప్రజాశక్తి-చిన్నగంజాం: చిన్నగంజాం మండలం, కడవకుదురు గ్రామంలోని వైసీపీ కార్యకర్త ధనరాజ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం తెలుసుకుని బుధవారం వైసీపీ పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త రాష్ట్ర కార్యదర్శి గాదె మధుసూధన రెడ్డి పరామర్శించారు. ఈయన వెంట చిన్నగంజాం మండల పార్టీ అధ్యక్షులు నాగేశ్వర్ రెడ్డి, సంతరావూరు మాజీ సర్పంచ్ చౌదరి, గోనసపూడి మాజీ సర్పంచ్ రామకృష్ణ తదితరులు ఉన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-వేటపాలెం : మత్స్యకార సంక్షేమ సమితి నూతన కార్యవర్గ ఎన్నిక బుధవారం నిర్వహించినట్లు జిల్లా అధ్యక్షుడు కొండూరు అంజయ్య తెలిపారు. వేటపాలెం మండల అధ్యక్షుడుగా ఆవుల నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా వాయిల పోలయ్య, కోశాధికారిగా వాయుల శ్రీరాములు మరో 12 మందితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పొన్నపూడి హనుమయ్య, సున్నపు తిరుపతిరావు, మోపిదేవి శ్రీనివాసరావు, కె.లక్ష్మీనారాయణలు పర్యవేక్షించినట్లు ఆయన తెలిపారు.

అద్దంకి: అద్దంకి సీమ బ్రాహ్మణ సేవా సంఘం నూతన అధ్యక్షుడిగా శ్రీపతి రంగనాథ చార్యులు పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. సింగరకొండ అభయాంజనేయ స్వామి 99 అడుగుల విగ్రహం వద్ద కార్యాలయంలో కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా హనుమంతరావు, సహాధ్యక్షుడిగా వామరాజు వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా పంచాజ్ఞుల సత్యనారాయణ, ఈదర వెంకట శివ ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా కారుమంచి వెంకటరమణ రావు, కోశాధికారిగా లక్కరాజు విశ్వ మోహన్, కోఆర్డినేటర్‌గా పుట్టం రాజు సాయి, బాలాజీలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో అడ్హాక్ కమిటీ కన్వీనర్ లక్కరాజు చంద్రశేఖర్, సింగరకొండ దేవస్థాన ప్రధాన పూజారి వంగల హరి శంకర్, అవధాని స్వర్ణ సుబ్బారావు, స్వర్ణ అన్నపూర్ణ పాల్గొన్నారు.

అశోక్‌బాబుకు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-బట్టిప్రోలు : వేమూరు నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబును పార్టీ అధిష్టానం రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమించటం పట్ల బుధవారం భట్టిప్రోలు ఎంపీపీ డివి లలిత కుమారి, నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో సుమారు 30 మందికి పైగా నాయకులు అశోక్ బాబుకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు అశోక్ బాబు బుధవారం తన నివాసంలో కలిసి ఎంపీపీ శాలువాతో సత్కరించారు. అలాగే ఐలవరం గ్రామం నుంచి సర్పంచ్ మాచర్ల కోటేశ్వరావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు అశోక్ బాబును కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జోషికాంత్, చిన్నారి, భాగ్యలక్ష్మి, సిరాజుద్దీన్, తులసీ రంగారావు తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-ఇంకొల్లు: ఇంకొల్లు బస్టాండ్‌లో జరుగుతున్న పనులను నెల్లూరు ఆర్టీసీ ఈఈ వెంకటేశ్వరరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్టాండ్‌లో అభివృద్ధి డిపో మేనేజర్లదేనన్నారు. మరుగుదొడ్ల నిర్మాణం వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్యాచ్ వర్క్‌లను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ వెంకటేశ్వర్లు, ఎలక్ట్రికల్ డీఈ శ్రీనివాస్‌రావు, కాంట్రాక్టర్ నరసయ్య, ప్రయాణికుల సంఘం అధ్యక్షులు అన్నంబోట్ల మోహనకృష్ణ, కంట్రోలర్ బాబు ఉన్నారు.

సురేష్‌కు మేరుగ పరామర్శ

ప్రజాశక్తి-అమృతలూరు: అమర్తలూరు మండలం ప్యాపర్రులో హత్యాయత్నానికి గురై చికిత్స పొందుతున్న సురేష్‌ను బుధవారం వైసీపీ బాపట్ల జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి మెరుగు నాగార్జున పరామర్శించారు. టిడిపి నేతల చేతిలో గాయాల పాలైన సురేష్‌కు పార్టీ అండగా ఉంటుందని నాగార్జున భరోసా ఇచ్చారు.

త్వరలో ఎయిర్‌పోర్ట్ కల సాకారం

- ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి
- భూములను పరిశీలించిన కేంద్ర విమానయాన సంస్థ ప్రతినిధులు



మాట్లాడుతున్న ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు ప్రాంతవాసులకు ఎయిర్‌పోర్టు కల త్వరలోనే సాకారం కానున్నట్లు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఒంగోలు సమీపంలోని ఆలూరు – గాదెపాలెం– అల్లూరు గ్రామాల మధ్య ఎయిర్‌పోర్టు నిర్మాణానికి సేకరించిన భూములను కేంద్ర విమానయాన సంస్థ అధికారులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్ర విమానయాన సంస్థ ప్రతినిధులు ఎఎస్ఎన్.మూర్తి, పర్విన్ తివారి, అమన్, అరుణ్‌కుమార్, షాజ్ అబుల్, నబీల్ రోషన్ ఎయిర్ పోర్టు కోసం గతంలో సేకరించిన 550 ఎకరాలకు సంబంధించిన మ్యాపులను పరిశీలించారు. అదేవిధంగా భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాగుంట మాట్లాడుతూ ఒంగోలు ఎయిర్ పోర్టు ఏర్పాటుపై 2006 నుంచి ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. గతంలో వాన్ పిక్ సంస్థ ఎయిర్ పోర్టుకు కొన్ని భూములు సేకరించిన్నట్లు తెలిపారు. వివిధ కారణాలతో ఆ ప్రయత్నాలు సఫలం కాలేదన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రాష్ట్రంలో కొత్తగా 5 ఎయిర్ పోర్టుల నిర్మాణానికి ప్రయత్నాలు చేస్తున్న నేపథ్యంలో ఒంగోలులో సేకరించిన భూములను పరిశీలించడానికి కేంద్ర విమానయాన సంస్థ నుంచి ఆరుగు సభ్యుల బందం వచ్చినట్లు తెలిపారు. త్వరలోనే వీరు నివేదికను అందిస్తారని తెలిపారు.

అనంతరం ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పాత్రికేయులతో మాట్లాడుతూ ఎయిర్ పోర్టు నిర్మాణానికి ఒంగోలు ఎంతో అనువైన ప్రదేశమన్నారు. ఎయిర్ పోర్టు కోసం గతంలోనే భూములు సేకరించి ఉంచామన్నారు. గత మూడు నెలలుగా ఎయిర్ పోర్టు భూముల విషయమై కసరత్తు చేశామన్నారు. జిల్లాలో ఎయిర్ పోర్టు వస్తే గ్రానైట్, ఆక్వా, పొగాకు రంగాలకు చెందిన వ్యాపారులకు మరింత ప్రయోజనం కలుగుతుందన్నారు. ఎయిర్‌పోర్ట్ ప్రతిపాదిత భూములు ఒంగోలు నగరానికి 8 కిలోమీటర్లు, కొత్తపట్నంకు 8 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయన్నారు. కొత్తపట్నంలో హార్బర్ కూడా ఏర్పాటు కానుందన్నారు. రామాయపట్నం పోర్టు నుంచి సరుకులను ఎయిర్‌పోర్ట్ ద్వారా రవాణా చేసే అవకాశం ఉందన్నారు. ముఖ్యమంత్రి ప్రకటించిన ఐదు ఎయిర్ పోర్టులలో ఒంగోలు ఒకటని తెలిపారు. ఈ విషయమై కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడును కలుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు ఆర్‌డిఒ కె.లక్ష్మి ప్రసన్న, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, కొత్తపట్నం తహశీల్దార్ పి.మధుసూదనరావు, స్థానిక ప్రజా ప్రతినిధులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న మంత్రి స్వామి

రహదారి నిబంధనలు పాటించాలి

మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రహదారి నిబంధనలు పాటించడం అందరి బాధ్యతని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి తెలిపారు. రహదారి భద్రతా మాసోత్సవాల'లో భాగంగా రవాణా శాఖ అధ్వర్యంలో కళాశాల విద్యార్థులతో నిర్వహించిన 'వాక్ థాన్‌ను జెండా ఊపి మంత్రి ప్రారంభించారు. కర్నూల్ రోడ్ లోని ఫ్లై ఓవర్ జంక్షన్ వద్ద ప్రారంభమైన ఈ వాక్ థాన్ పట్టణ పురవీధుల గుండా చర్చి సెంటర్ వరకూ సాగింది. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ మన భద్రత కోసం ఏర్పాటు చేసిన నియమాలను మనందరం పాటించాలన్నారు. నిబంధనల మేరకు మాత్రమే వాహనాల్లో ప్రయాణించాలన్నారు. ద్విచక్ర వాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల న్నారు. మద్యం సేవించి వాహ నాలు నడపరాదని తెలిపారు. రహదారులపై ప్రమాదాలకు కారణమవుతున్న గుంటలకు రాష్ట్ర ప్రభుత్వం మరమ్మతులు చేయించిందన్నారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ రహదారి ప్రమాదాల్లో గాయపడిన వారిని తక్షణం ఆస్పత్రికి తరలించి చికిత్స అందించాలన్నారు. రహదారి ప్రమాద బాధితులను ఆస్పత్రులకు తరలించిన వారికి కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందజేస్తోందన్నారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా వాహనం నడపడం, రాంగ్ రూట్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్, సెల్ ఫోన్ డ్రైవింగ్ ప్రమాదకరమన్నారు. కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా మాట్లాడుతూ నెల రోజుల పాటు వివిధ కార్యక్రమాల ద్వారా ప్రజలకు రహదారి భద్రతపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఎస్‌పి దామోదర్ మాట్లాడుతూ, రహదారి భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. సీట్ బెల్ట్, హెల్మెట్ వినియోగం తప్పనిసరి అని తెలిపారు. ఉప రవాణా కమిషనర్ ఆర్. సుశీల మాట్లాడుతూ రహదారి భద్రతా నియమాలపై ప్రజలకు, ముఖ్యంగా యువతకు నెల రోజుల పాటు అవగాహన కల్పించేలా ప్రణాళిక రూపొందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కె. వెంకటేశ్వర రావు, ఇతర ప్రజా ప్రతినిధులు, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

విద్యకు అత్యధిక ప్రాధాన్యత : మంత్రి



శంకుస్థాపనలో మంత్రి స్వామి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి తెలిపారు. ఒంగోలు నగరంలో రూ.6.15 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న బాలికల కొత్త వసతి గహాలకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఒంగోలు నగరంలో రూ.30 కోట్ల రూపాయల వ్యయంతో విద్యార్థుల కోసం వసతి గహాలు నిర్మిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ప్రస్తుతం బాలికల వసతి గహాన్ని రూ.6.15 కోట్లతో వ్యయంతో నిర్మిస్తున్నామన్నారు. బాలురకు కూడా వసతి గహం నిర్మిండానికి చర్యలు తీసుకుంటామన్నారు. హాస్టల్ పిల్లల భద్రత, ప్రాంగణంలో పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. హాస్టల్ పిల్లలకు అవసరమైన దుప్పట్లు, పెండింగ్‌లోని మెస్ బిల్లులు చెల్లించామన్నారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలకు పెద్దపీట వేస్తోందన్నారు. జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలో కూడా నూతన హాస్టల్స్ నిర్మాణం చేపడుతోందన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు మాట్లా డుతూ ఈ వసతి గహంలో 600 మంది విద్యార్థి నులకు వసతి కల్పించడం జరుగుతుందన్నారు. ఒక సంవత్సరంలోగా నిర్మాణం పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కలెక్టర్, మేయర్ మాట్లాడుతూ బాలికల విద్యాభివద్ధికి, సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మా నాయక్. ఎస్‌సి. కార్పోరేషన్ ఈడీ అర్జున్ నాయక్, ఎపిఇడబ్ల్యుఐడిసి ఇఇ భాస్కర బాబు, స్థానిక ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు


ప్రజాకవి మల్లవరపు జాన్‌కు నివాళి

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

పద్యకవుల్లో ప్రజాకవి మల్లవరపు జాన్ అని న్యాయవాది, సామాజికవేత్త అట్లూరి రాఘవులు పేర్కొన్నారు. ప్రముఖ పద్య కవి, మధురకవి మల్లవరపు జాన్, ప్రముఖ కవి ఎండ్లూరి సుధాకర్ సాహితీ జయంతి సభ ఒంగోలు జానుడి సాహిత్య కేంద్రంలో బుధవారం నిర్వహించారు. జానుడి సెంటర్ ఫర్ లిటరేచర్ అండ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎద్దు విజయకుమార్ అధ్యక్షత వహించారు. జానుడి డైరెక్టర్ డాక్టర్ నూకతోటి రవికుమార్ సమన్వకర్తగా వ్యవహించారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ ఉపాధ్యా యుడిగా అనేక విద్యార్థులను తీర్చిదిద్దిన జాన్ మాస్టారు కవిగా ప్రయోజనవంత కవిత్వాన్ని సష్టించారన్నారు. చందస్సు, అలంకార శాస్త్రంపై గొప్పపట్టు ఉన్న జిల్లా కవిగా రాష్ట్ర వ్యాప్తంగా ఖ్యాతిని గడించారని తెలిపారు. అనంతరం ప్రజా గాయకుడు సురేష్ పాడిన గీతాలు అలరింపజేశాయి ఈ కార్యక్రమంలో బహుజన కెరటాలు ప్రతినిధి చప్పిడి కోటేశ్వరరావు, అసోసియేషన్ ప్రైవేట్ లెక్చరర్స్ అండ్ టీచర్స్ ప్రతినిధి జాన్ సామ్యూల్, న్యాయవాది ఆడే రామ సుబ్బారావు, లెక్చరర్స్ అసోసియేషన్ ప్రతినిధులు దారా మోహన్, బ్రహ్మయ్య, సాయి రాజేష్, సాహిత్య పరిశోధకుడు నోసిన వెంకటేశ్వర్లు, శానం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించాలి

జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్



మాట్లాడుతున్న జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిం చేందుకు అధికారులు తగు చర్యలు తీసుకోవాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణపై జిల్లా అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు తీరు, అభివద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. 18 స్టాల్స్ ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా ప్రగతిని చాటి చెప్పేలా శకటాల ప్రదర్శన ఉండాలన్నారు. కనీసం 12 శకటాలు ఏర్పాటు చేయాలన్నారు. గణతంత్ర దినోత్సవం నిర్వహించే పోలీస్ కవాతు మైదానాన్ని సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. సాంస్కతిక కార్యక్రమాలు అతిథులను అలరించేలా ఉండాలన్నారు. అతిథులు, అధికారుల గ్యాలరీ పకడ్బందీగా ఏర్పాటు చేయాలన్నారు. బ్యారికేడ్లు ఏర్పాటుతో ఎలాంటి సమస్యలు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వేడుకలకు హాజరయ్యే ప్రజలకు తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. వరద విపత్తు సమయంలో కష్టపడి పనిచేసిన అధికారులు, ఉద్యోగులకు అవార్డుల ప్రదానం చేస్తారని తెలిపారు. ఇందుకోసం అన్ని శాఖలలో ఉద్యోగులను గుర్తించి వారి పేర్లను 23వ తేదీ సాయంత్రంలోపు కలెక్టరేట్ కు పంపాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్, బాపట్ల ఆర్‌డిఒ గ్లోరియా,అధికారులు పాల్గొన్నారు.